
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

తిరుపతి
జిల్లా వార్తలు
మంగళవారం 10 డిసెంబరు 2024

● నేడు ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం



హ్యూమన్ రైట్స్ రుబాబు

● జిల్లాలో నకిలీ సంఘాల జోరు
● ఈ బోర్డులతో తిరుగుతున్న కార్లు




హ్యూమన్ రైట్స్ నేషనల్ వైస్ చైర్మన్ హోదా బోర్డుతో తిరుపతిలో తిరుగుతున్న కార్లు

పోలీసులు సైతం భయపడేది ఒక్క 'హ్యూమన్ రైట్స్' అనే పదానికి మాత్రమే. భారత రాజ్యాంగంలో మహనీయుడు అంబేద్కర్ పొందుపరచిన మానవ హక్కులు ఫలితం అది. మానవహక్కుల ఉల్లంఘనను చట్టం తీవ్రంగా పరిగణిస్తుంది. ఈ ప్రాధాన్యాన్ని అడ్డం పెట్టుకుని జిల్లాలో హ్యూమన్ రైట్స్ సంఘాల పేరుతో నకిలీల దబాయింపు పెరిగింది. వివాదాల్లో జోక్యం చేసుకోవడం, పంచాయతీలు చేయడం వీరికి ఉపాధిగా మారింది. పిటిషన్లు పెట్టి బెదిరించడం కూడా జిల్లాలో పెచ్చుపెరిగాయి. హ్యూమన్ రైట్స్ అంటూ ఎర్రటి పెద్ద అక్షరాలను కార్ల మీద వేసుకుని వీరు దబాయించి మరీ తిరుగుతూ ఉన్నారు.

నిజమైన సంఘాలు రెండే!

వాస్తవంగా జాతీయ స్థాయిలో జాతీయ మానవహక్కుల కమిషన్, రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర మానవహక్కుల కమిషన్ అనేవి మాత్రమే రాజ్యాంగబద్ధమైనవి. రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జి అధ్యక్షతన జాతీయ మానవహక్కుల కమిషన్ ఏర్పడుతుంది. హైకోర్టు రిటైర్డ్ జడ్జి ఛైర్మన్‌గా రాష్ట్ర మానవహక్కుల కమిషన్ ఏర్పడుతుంది. వీటిల్లో రిటైరైన న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, సామాజిక కార్యకర్తలు సభ్యులుగా ఉంటారు. వీరికి మాత్రమే ప్రొటోకాల్ ఉంటుంది. మానవహక్కుల ఉల్లంఘనపై ఫిర్యాదులు అందితే ఈ కమిషన్‌లు సీరియస్‌గా తీసుకుంటాయి. కొన్ని సందర్భాల్లో సుమోటోగా కూడా స్వీకరిస్తాయి.

నకిలీల జోరు

పౌరుల హక్కులకు భంగం కలిగినపుడు మేధావులతో కూడిన మానవహక్కుల సంఘాలు స్పందిస్తాయి. నిజనిర్ధారణ జరిపి వాస్తవాలు వెల్లడిస్తాయి. ఇటువంటి పనిని రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం, మానవహక్కుల వేదిక అనేక దశాబ్దాలుగా చేస్తున్నాయి. బాధితుల పక్షాన కోర్టుల్లో కేసులు కూడా వీరు నడుపుతారు. అయితే జిల్లాలో హ్యూమన్‌రైట్స్ పేరుతో ఇబ్బడిముబ్బడిగా సంఘాలు చలామణి అవుతున్నాయి.

విచిత్రం ఏమిటంటే హ్యూమన్ రైట్స్ సంఘాల పట్ల తగిన అవగాహనలేకపోవడంతో పోలీసులు కూడా వీరి దబాయింపులకు జంకిపోతుంటారు. కొందరు వీరికి సహకరిస్తూ కూడా ఉంటారు. ఇదే వీరికి పెట్టుబడిగా మారింది.

హ్యూమన్ రైట్స్ బోర్డులతో కార్లు

జిల్లాలో హ్యూమన్ రైట్స్ అనే బోర్డులతో తిరిగే వాహనాల జోరు చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. బుగ్గకార్లు కూడా ఉన్నాయి. సైరన్లు సైతం మోగిస్తూ వీరు హడావుడి చేస్తున్నారు. ట్రాఫిక్ రద్దీ ఉండే ప్రదేశాల్లో, హైవేల టోల్‌గేట్‌ల వద్ద, పెయిడ్ పార్కింగ్‌ల వద్ద వీరి దబాయింపు కనిపిస్తుంది. ఈ వాహనాల మీద హ్యూమన్ రైట్స్ ఛైర్మన్, ప్రెసిడెంట్, సెక్రటరీ వంటి బోర్డులుండడం విశేషం. జిల్లాలో మానవహక్కుల కమిటీల పేరుతో దాదాపు 70కి పైగా వాహనాలు తిరుగుతున్నాయంటే వీరి రుబాబు ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక్క తిరుపతి నగరంలోనే 30 వాహనాలు తిరుగుతున్నాయి. పోలీసులూ, రవాణా అధికారులు కూడా ఎందుకొచ్చిన తంటా అనుకుని వీటి జోలికి వెళ్లడం లేదు. ఎర్రచందనం, గంజాయి వంటి మాదకద్రవ్యాల రవాణాకు కూడా ఈ వాహనాలు వాడుకుంటున్నారనే ఆరోపణ ఉంది.

\- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి




జిల్లా వైస్ ప్రెసిడెంట్ బోర్డుతో.. - రాష్ట్ర కార్యదర్శి హోదా బోర్డుతో..

రెవెన్యూ సదస్సులకు 696 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు 696 అర్జీలు అందినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. 32 గ్రామ సభలను ఏర్పాటు చేయగా భూ కబ్జాలపై 16 ఫామ్‌ఏలపై 11, ఇళ్ల స్థలాలకు 53, ఆర్‌ఓఆర్‌పై 283, అసైన్మెంట్ ల్యాండ్‌పై 41, ఇతర విషయాలకు సంబంధించి 223 అర్జీలు వచ్చాయని వివరించారు. కొన్ని సమస్యలు అప్పటికప్పుడే పరిష్కరించామని, మిగిలిన సమస్యలను కాల పరిమితి లోపల సంబంధిత అధికారులు పరిష్కరిస్తారని తెలిపారు.

21 నుంచీ డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ తదితర కోర్సులకు సంబంధించిన మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 21వ తేదీ నుంచీ ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పరీక్షల విభాగం చేపడుతోంది. ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తారు.

3, 5 సెమిస్టర్‌లో నలుగురు డీబార్

ఎస్వీయూ పరిధిలో ప్రస్తుతం నిర్వహిస్తున్న డిగ్రీ 3, 5 సెమిస్టర్ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు డీబార్ అయ్యారు. పరీక్షలను పర్యవేక్షిస్తున్న హైపవర్ కమిటీ చిత్తూరులో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న నలుగురిని గుర్తించి డీబార్ చేసినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు.



కలెక్టరేట్ వద్ద సైదమ్మ

అనాథలకు ఆధార్ ఇవ్వరా?

'ఏర్పేడు మండలం వికృతమాల పునరావాస కేంద్రంలో 40మంది అనాథలు ఆశ్రయం పొందుతున్నారు. వారికి ఆధార్ కార్డులు లేకపోవడంతో అత్యవసర సమయంలో ఆస్పత్రికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. ఇప్పటికే చాలాసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు' అంటూ ఆశ్రమ నిర్వాహకురాలు సైదమ్మ కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వినతిపత్రం ఇచ్చారు.

\- మరిన్ని వినతులు.. ఫిర్యాదులు 8లో

టీడీఆర్ బాండ్ల విచారణ వేగవంతం

తిరుపతి, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై నివేదికకు తుదిరూపు ఇచ్చేందుకు డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (డీఎంఏ) సిద్ధమైంది. విచారణ నిమిత్తం రికార్డులను తీసుకు రావాలని ఆదేశించింది. ఈమేరకు విజయవాడ వడ్డేశ్వరంలోని డీఎంఏ కార్యాలయానికి అధికారులను డిప్యుటేషన్‌పై పంపించాలని టౌన్‌ప్లానింగ్ అనంతపురం రీజనల్ డైరెక్టర్ జి.ఆర్.సంజీవ్ కుమార్ కమిషనర్ మౌర్యను నాలుగు రోజుల క్రితం లిఖితపూర్వకంగా కోరారు. టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ సిటీ ప్లానర్ ఎస్.మహాపాత్ర, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు పి.వినయ్ కుమార్, వై.పురుషోత్తం రెడ్డి, డి.శ్రవణ్ కుమార్‌లు రికార్డులతో డీఎంఏ కార్యాలయానికి రావాలని పేర్కొన్నారు. కాగా టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు గత వైసీపీ నేతలకు అనుకూలంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి.

విజయవాడకు రికార్డులు తీసుకురండి

'కూటమి' అధికారంలోకి వచ్చాక..

గత వైసీపీ ప్రభుత్వంలో తిరుపతిలో టీడీఆర్ బాండ్ల జారీలో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని పలు మున్సిపాల్టీలపై విచారణకు ఆదేశించింది. ఇందులో భాగంగా జరిగిన శాఖాపరమైన విచారణలో తిరుపతి టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై డీఎంఏకు చేరిన నివేదికపై ప్రభుత్వ పెద్దలు అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. మరింత సమగ్ర విచారణకు అనంతపురం టౌన్ ప్లానింగ్ ఆర్డీ నేతృత్వంలో డీఎంఏ కార్యాలయంలో విచారణ చేపట్టనున్నారు. దీనికి సంబంధించిన రికార్డులను వెంటపెట్టుకుని రావాలని డీసీపీతో పాటు వార్డు సెక్రటరీలను ఆదేశించినట్టు సమాచారం. డీసీపీ మహాపాత్ర సమర్థత, నిజాయతీపై నమ్మకంతో విచారణలో ఆయనే కీలకం కానున్నట్టు తెలుస్తోంది.

కౌన్సిల్ ప్రతిపాదించిన 42 రోడ్లలో ఇప్పటివరకు నిర్మించిన 18 రోడ్లకు సంబంధించి 1121 మంది భూములు కోల్పోయారు. వీరిలో 373 మందికి మాత్రమే టీడీఆర్ బాండ్లు జారీచేశారు. ఇంకా 1200కు పైగా టీడీఆర్ బాండ్లు ఇవ్వాల్సి ఉంది. ఇప్పటివరకు రూ1,013 కోట్లు టీడీఆర్ బాండ్లు జారీచేశారు. ఇందులో 75 శాతం టీడీఆర్ బాండ్లు వినియోగం జరిగిపోయిందని, తక్కిన 25 శాతం మాత్రమే ఉన్నట్టుగా తెలుస్తోంది.



విజిలెన్సు దూకుడు

తిరుపతి (నేరవిభాగం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీడీఆర్ బాండ్ల విచారణలో విజిలెన్సు చురుగ్గా వ్యవహరిస్తోంది. విచారణలో భాగంగా.. మాస్టర్ ప్లాన్ రోడ్లు ఏర్పాటు చేసిన సమయంలో ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయి? కాలువ పోరంబోకు, చెరువు పోరంబోకు, డీకేటీ భూములు ఉన్నాయా? ఉంటే వాటిని రికార్డుల్లో చూపకుండా పట్టా భూములు సేకరించినట్లు చూపించి అధిక ధర ఏమైనా చెల్లించారా? అని తెలుసుకోవడానికి తిరుపతి అర్బన్ సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్లకు లేఖలు రాసినట్లు సమాచారం. ఏయే సర్వే నెంబర్లలో ఎంత భూమి సేకరించారు? అక్కడ మార్కెట్ విలువ ఎంత? ఎంత విలువకు టీడీఆర్ బాండ్లు చెల్లించారు? మార్కెట్ విలువ కంటే ఎక్కువగా ఏమైనా భూమి విలువ నిర్ధారించి టీడీఆర్ బాండ్లు జారీ చేశారా అనే కోణంలోనూ విచారణ చేయనున్నారు. దీనికోసం అటు మార్కెట్ విలువ, ఇటు భూముల వివరాలు తెప్పించి వివిధ కోణాల్లో దర్యాప్తు చేయనున్నట్లు విజిలెన్సు అధికారి ఒకరు చెప్పారు. కాగా, రెసిడెన్షియల్ ఏరియాను కమర్షియల్‌గా చూపి టీడీఆర్ బాండ్లు ఇచ్చినట్లు విజిలెన్సు విచారణలో తెలిసినట్లు సమాచారం. ఉదాహరణకు.. పూలవానిగుంట రోడ్డులో అరకిలోమీటరు పొడవున మాస్టర్ ప్లాన్ రోడ్డు ఏర్పాటు చేశారు. దీనికోసం ఆరుగురికి టీడీఆర్ బాండ్లు ఇచ్చారు. ఈ రోడ్డులో రెసిడెన్షియల్ ప్లాట్లు ఉన్నప్పటికీ అధిక ధర కోట్‌చేసి కమర్షియల్ ప్లాట్లుగా రికార్డులు సృష్టించినట్లు సమాచారం. ఇక 150 మీటర్ల పొడవున్న నారాయణపురం రోడ్డులో ఒక టీడీఆర్ బాండు ఇచ్చారు. ఇక్కడా నిధులు గోల్‌మాల్ జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. తిరుమల బైపాస్ రోడ్డులోని కొర్లగుంట జంక్షన్ నుంచి రేణిగుంట రోడ్డును కలుపుతూ ఏర్పాటు చేసిన 1.56 కిలోమీటర్ల 40 అడుగుల రోడ్డులో 156 మందికి టీడీఆర్ బాండ్లు జారీ చేశారు. క్షేత్ర స్థాయిలో ఇన్ని బాండ్లు పంపిణీ చేశారా అనేదీ ఆరా తీస్తున్నారు. కాగా, మూడు రోజుల కిందటి వరకు పది రోడ్ల వరకు విచారణ పూర్తయినట్లు తెలిసింది. మిగతా రోడ్లకు సంబంధించి వారం రోజుల్లో విచారణ పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు విజిలెన్సు అధికారి ఒకరు చెప్పారు.

సెట్ బ్యాక్‌లకూ టీడీఆర్..!

భవన నిర్మాణంలో విడిచిపెట్టిన సెట్‌బ్యాక్‌లకు కూడా టీడీఆర్ బాండ్లు ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. కొంతమంది స్థల యజమానులకు తెలియకుండానే బాండ్లు జారీ అయినట్లు చెబుతున్నారు. కొన్ని రోడ్ల వెడల్పు, పొడవులోనూ మతలబు చోటుచేసుకున్నట్లు విజిలెన్సు విచారణలో వెలుగు చూసినట్లు సమాచారం. ఉదాహరణకు 40 అడుగుల రోడ్డుకుగాను.. తమకు కావాల్సిన వారి భవనాలు, దుకాణాలు, షాపింగ్ కాంప్లెక్సులున్న చోట 30 అడుగులు మాత్రమే రోడ్డు వేసి.. మిగిలిన భూమి సేకరించినట్లు రికార్డుల్లో నమోదు చేసినట్లు విమర్శలున్నాయి. వీటన్నింటిపైనా విజిలెన్సు దృష్టి పెట్టింది.

పుత్తూరు కేంద్రంగా పేట్రేగుతున్న

బియ్యం స్మగ్లర్లు

పట్టుబడిన 2,250 కిలోల రేషన్ బియ్యం ● ముగ్గురు నిందితుల అరెస్టు

పుత్తూరు అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పుత్తూరు కేంద్రంగా రేషన్ బియ్యం ముఠా పేట్రేగిపోతోంది. తమిళనాడు సరిహద్దు ప్రాంతం కావడంతో అవలీలగా రేషన్ బియ్యాన్ని తరలించేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రేషన్ బియ్యం పక్కదారి పడుతుండటంతో ప్రభుత్వం ప్రత్యేక నిఘా విభాగం ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈక్రమంలో పుత్తూరు కేంద్రంగా రూ.2.05 కోట్ల రేషన్ బియ్యాన్ని సీఎస్‌డీటీ విష్ణు నల్లబజారుకు తరలించిన సంఘటన తెలిసిందే. తాజాగా 2,250 కిలోల రేషన్ బియ్యం స్థానిక కాపు వీధిలో ఓ ముఠా తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడింది. బియ్యాన్ని సీజ్ చేసిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సీఐ సురేంద్రనాయుడు ఆదేశాల మేరకు కేసు నమోదు చేశారు. కాగా, ఈ నెల 3న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు, ఈ ముఠా వెనుక ఎవరు ఉన్నారన్న కోణంలో దర్యాప్తు చేపట్టారు. పుత్తూరు, పిచ్చాటూరు పౌరసరఫరాల శాఖ గోదాంలో జరిగిన బియ్యం అవినీతి ముఠా హస్తంపై విచారించారు. చివరకు పట్టుబడిన నిందితులు చిన్న వ్యాపారులుగా గుర్తించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి లక్ష్మి, చిన్న, అమృతరాజ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. సోమవారం పట్టుబడిన బియ్యాన్ని పుత్తూరు పౌరసరఫరాల శాఖ గోదాంకు తరలించారు.



గోదాంకు తరలిస్తున్న రేషన్ బియ్యం

50 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

నాయుడుపేట టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పడమటి వీధిలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 50 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు.




పట్టుబడ్డ రేషన్ బియ్యం

రక్తం లేదు.. తిరుపతికి వెళ్లండి

● చివరి నిమిషంలో గర్భిణులను రెఫర్ చేస్తున్న డాక్టర్లు

శ్రీకాళహస్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఏ గ్రూప్ రక్తమూ లేదని అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఇదే సాకుగా చూపుతూ వారం రోజులుగా గర్భిణులను చివరి నిమిషంలో తిరుపతికి రెఫర్ చేస్తున్నారు.

● తొట్టంబేడు మండలం కన్నలికి చెందిన మంజూషా కాన్పు కోసం సోమవారం ఆస్పత్రిలో చేరారు. ఈ నెల 2 నుంచి వీరు వైద్య పరీక్షలకు వస్తున్నారు. వైద్యుల సూచన మేరకు సోమవారం ఉదయం కాన్పు కోసం ఏమీ తినకుండా ఆమె వచ్చారు. ఆపరేషన్ థియేటర్‌లో ఎనిమా ఇచ్చాక రక్తం లేదని చెబుతూ తిరుపతికి రెఫర్ చేయడంపై ఆమె కుటుంబీకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి నిమిషంలో ఇలా ఎలా రెఫర్ చేస్తారంటూ వైద్యులను నిలదీశారు.



● సోమవారమే శ్రీకాళహస్తి పట్టణానికి చెందని ఓ యువతిని రక్తం లేదన్న కారణంతో నెల్లూరుకు రెఫర్ చేశారు. ఒకరోజే ఇద్దరు గర్భిణులను రెఫర్ చేయడం సామాజికమాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

● అలాగే, శ్రీకాళహస్తి మండలం జింగిలిపాళేనికి చెందిన గర్భిణి ఖుష్బును ఏడు రోజులపాటు ఆస్పత్రికి తిప్పుకొన్నారు. శనివారం, చివరి నిమిషంలో రెఫర్ చేశారు. దీంతో ఆమె కుటుంబీకులు వైద్యులతో వాగ్వాదానికి దిగారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి.

వైభవంగా కార్తీక మాస పూజలు



శాకంబరి అలంకరణలో అగస్త్యేశ్వరస్వామి, అన్నాభిషేకంలో దర్శనమిస్తున్న మల్లేశ్వరస్వామి

చంద్రగిరి, డిసెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): చంద్రగిరి మండలంలోని శివాలయాల్లో సోమవారం తమిళ కార్తీక మాస పూజలు వైభవంగా నిర్వహించారు. తొండవాడ వద్ద స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉదయం అగస్త్యేశ్వర స్వామికి రుద్రాభిషేకం, అనందవల్లీదేవికి అభిషేకం నిర్వహించారు. స్వామివారికి శాకంబరి అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. తమిళ కార్తీక సోమవారం కావడంతో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మహిళలు దీపారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో అగస్త్యేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి, భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా చంద్రగిరిలోని శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయంలో ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఈకార్యక్రమంలో ఆలయ శైవాంగ పండితులు శివకుమార్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కట్టమీద గంగమ్మ ఆలయంలో విగ్రహావిష్కరణ పూజలు



భాకరాపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగావాండ్లపల్లె పంచాయతీ చినిగేపల్లె సమీపంలోని కట్టమీద గంగమ్మ ఆలయంలో విగ్రహావిష్కరణ పూజలు గణపతి పూజతో సోమవారం సాయంత్రం వేద పండితులు ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే విగ్రహావిష్కరణ పూజలు చినిగేపల్లె, మారసానివారిపల్లె, కురవపల్లె, హరిజనవాడ గ్రామాల ప్రజలు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇన్‌స్ట్రక్షనల్ డిజైన్ డెలివరీ సిస్టమ్‌పై అవగాహన సదస్సు ప్రారంభం



ఎంబీయూలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న నాగరాజరామారావు

చంద్రగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం, ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ఇన్‌స్ట్రక్షనల్ డిజైన్ డెలివరీ సిస్టమ్ అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సదస్సు సోమవారం ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థ అయిన చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్ ట్రైనింగ్, పరిశోధన(ఎన్ఐటీటీటీ, ఆర్) సంస్థ సమన్వయంతో ఈ సదస్సు సోమవారం నుంచి శుక్రవారం వరకు జరుగుతుంది. విద్యార్థులలో సృజనాత్మక శక్తిని, నైపుణ్యతను, ఆసక్తిని పెంపొందించడానికి అధ్యాపకులు ఎలాంటి బోధనా పద్ధతులు పాటించాలి తదితర అంశాలపై నిష్ణాతులైన ఎన్ఐటీటీటీ అండ్ ఆర్ సంస్థ ప్రొఫెసర్ శెల్వకుమారి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంబీయూ ప్రొవోస్ట్ నాగరాజరామారావు, వైస్ చాన్సలర్ కరుణాకరణ్, రిజిస్ట్రార్ డాక్టర్ సారథి, రీసోర్స్ పర్సన్లు గిరిధరణ్, సతీష్ పాల్గొన్నారు.

మామిడిపంటకు బీమా చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్నసునీల్

రామచంద్రాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు మామిడి పంటకు బీమా చేసుకోవాలని ఉద్యానశాఖాధికారి సునీల్ కోరారు. గంగిరెడ్డిపల్లి రైతు భరోసా కేంద్రంలో సిబ్బందితో సోమవారం ఉద్యాన పంటల సాగుపై సమావేశం జరిగింది. సునీల్ మాట్లాడుతూ ఎకరా మామిడి పంటకు రైతులు రూ.1,750 చెల్లించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం వాటిల్లితే రూ.35వేలు బీమా వస్తుందన్నారు. ఇందుకు రైతు పాసుపుస్తకం, రైతు సేవా కేంద్రం నుంచి పంట వేసినట్లు ధృవపత్రం, ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్సు జతచేయాలని కోరారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుప్పంబాదూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు మెరుగులు



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ తదితరులు

రామచంద్రాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరి చైర్‌పర్సన్ రామ్‌సింగ్ ఈ నెల 14వ తేదీ పరిశీలించనున్న నేపథ్యంలో అధికారులు వారం రోజులుగా ఏకబిగిన సబ్‌స్టేషన్ మరమ్మతులు చేపడుతున్నారు. సబ్‌స్టేషన్ పరిసరాల్లో ఉన్న ముళ్లపొదలను తొలగించారు. గ్రామాల్లో విద్యుత్‌లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి లైన్లను సరిచేశారు. యంత్రాలను శుభ్ర పరిచారు. పరిసరాలకు మెరుగులు దిద్దారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సురేంద్ర నాయుడు, డీఈ ఆశీర్వాదం, ఏడీఈ శంకరయ్య, ఏఈ గిరి పాల్గొన్నారు.

ఎన్వీఎన్ పాఠశాలకు కంప్యూటర్ల వితరణ



కంప్యూటర్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థి, ఉపాధ్యాయులు

పాకాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్వీఎన్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి, ఉపాధ్యాయులు కంప్యూటర్లను అందజేశారు. ఎంఈవో బాట్జీ చేతులమీదుగా పూర్వ విద్యార్థి రాజేష్ ఒక కంప్యూటర్, ఉపాధ్యాయ బృందం రెండు కంప్యూటర్లు సోమవారం అందజేశారు. ఎంఈవో మాట్లాడుతూ దాతలు అందజేసిన కంప్యూటర్లను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మోహన్, ఉపాధ్యాయులు బాలసుబ్రమణ్యం, శ్రీధర్, చిట్టిబాబు, రమేష్, మురళి, శ్రీలక్ష్మీ, శ్రీదేవి, కమిటీ చైర్‌పర్సన్ కుసుమకుమారి, వైస్ చైర్‌పర్సన్ మహాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఇంటిపై దౌర్జన్యం

పాకాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రవణయ్యగారిపల్లె పంచాయతీ చంద్రగిరివారిపల్లెలో ఆదివారం రాత్రి శంకరరెడ్డి ఇంటిపై కొంతమంది దౌర్జన్యానికి దిగిన ఘటన చోటుచేసుకుంది. పాకాల సీఐ మద్దయ్య ఆచారి కథనం మేరకు వివరాలు.. నెల రోజుల క్రితం దామలచెరువులో ఒక అమ్మాయి విషయంలో గొడవ జరిగింది. అనంతరం పెద్దమనుష్యుల ప్రమేయంతో సద్దుమణిగింది. ఆ గొడవను వీడియో తీసిన వ్యక్తి రెండు రోజుల క్రితం సామాజిక మాధ్యమాలలో పెట్టడంతో దెబ్బలు తిన్న వ్యక్తి కొంతమందితో కలిసి చంద్రగిరివారిపల్లెకు వెళ్లి అర్ధరాత్రి శంకరరెడ్డి ఇంటి వద్దకెళ్లి పూలకుండీలు పగులగొట్టి దౌర్జన్యం చేశాడు. దీంతో బాధితుడు సోమవారం పాకాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు



పైపులైన్ లీకేజీలను అరికడుతున్న అధికారులు

రామచంద్రాపురం, డిసెంబరు 9(ఆంధ్ర జ్యోతి): మండలంలోని పీవీపురం, నెత్తకుప్పం తాగునీటి పైపులైన్ల లీకేజీలను సోమవారం అధికారులు అరికట్టారు. ఆంధ్రజ్యోతిలో తాగునీటి లీకేజీలను అరికట్టండి అన్న కథనానికి అధికారులు స్పందించారు. దీంతో అధికారులు అక్కడికి చేరుకుని పైపులైను పగిలిన చోట గుంతలు తీసి సరిచేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నేడు వల్లివేడులో రెవెన్యూ సదస్సు

పాకాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లివేడులో సోమవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ నిత్యానంద బాబు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరవుతారని, రెవెన్యూ గ్రామ పరిధిలోని ప్రజలు సదస్సుకు హాజరై సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.

పద్మావతి వర్సిటీ వీసీ ఉమ జర్మనీ పర్యటన



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ జర్మనీకి బయలుదేరి వెళ్లారు. బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో జర్మనీకి చెందిన విద్యాసంస్థలతో నేరుగా సంప్రదింపులు చేయనున్నారు. ఈ క్రమంలో జర్మనీలోని పలు విద్యాసంస్థలను పరిశీలించనున్నారు. ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు ఆమె జర్మనీలో పర్యటిస్తారు. విద్యార్థులు, అధ్యాపకుల పరస్పర మార్పిడి, కోర్సుల నిర్వహణ, పరిశోధనలు చేపట్టడం కోసం అక్కడి పరిస్థితులను క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలిస్తారు. జర్మనీ విద్యాసంస్థల సహకారంతో పద్మావతి యూనివర్సిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ఈ పర్యటన తోడ్పడుతుందని వీసీ పేర్కొన్నారు.

'మఠం' ఆక్రమణలపై చర్యలకు సిద్ధం

- ఆర్డీవోను కలిసిన మఠం ఏవో



ఆర్డీవో రామ్మోహన్‌తో చర్చిస్తున్న మఠం ఏవో రామారావు

తిరుపతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హథీరాంజీ మఠం భూముల ఆక్రమణలపై అధికారులు చర్యలకు సిద్ధమవుతున్నారు. మఠం పరిపాలనాధికారి రామారావు సోమవారం క్షేత్రస్థాయిలోని పలు ఆక్రమణలను తనిఖీ చేశారు. అనంతరం పీజీఆర్ఎస్‌లో ఉన్న ఆర్డీవో రామ్మోహన్‌ను కలిశారు. తిరుపతితో పాటు ఉమ్మడి జిల్లాలో ఉన్న మఠం భూముల అన్యాక్రాంతంపై చర్చించారు. ముఖ్యంగా తిరుచానూరు పరిధిలోని దాదాపు 164 ఎకరాల మఠం భూమి ఆక్రమణకు గురైన విషయాన్ని ప్రస్తావించారు. దీనిపై ఆర్డీవో కోర్టులో అప్పీల్ చేసినట్లు మఠం ఏవో ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ నోటీసులు సిద్ధం చేయాలని కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు.

ప్రజా వినతులను తక్షణం పరిష్కరించాలి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే వినతులను పరిశీలించి, తక్షణం పరిష్కరించాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 68 మంది బాధితులు హాజరై వినతులు సమర్పించారు. అర్జీదారులతో ఎస్పీ మాట్లాడి కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన సమస్యలను సంబంధిత స్టేషన్లకు పంపి, పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్పీ కార్యాలయానికి రాలేని వారు సంబంధిత స్టేషన్లలో అర్జీలు ఇచ్చి సమస్యలు పరిష్కరించుకోవచ్చని సూచించారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచారి పాల్గొన్నారు.

ఏడు గంగమ్మల జాతర బందోబస్తుపై కసరత్తు



గంగమ్మ కొలువు దీరే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ రవి మనోహరాచారి

శ్రీకాళహస్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం వైభవంగా జరగనున్న ఏడు గంగమ్మల జాతరను పురస్కరించుకుని బందోబస్తు ఏర్పాట్లపై పోలీసు అధికారులు కసరత్తు చేశారు. ఈ మేరకు సోమవారం ఏఎస్పీ రవి మనోహరాచారి, శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి ఏడు గంగమ్మల అమ్మవార్లు కొలువు దీరే ప్రాంతాలను పరిశీలించారు. కోర్టు సమీపంలోని ఏడు గంగమ్మల ఆలయం వద్ద బుధవారం వేకువజామున ఏడు గంగమ్మలు ఒకే సారి ఊరేగింపుగా బయలుదేరి పెండ్లిమండపం చేరుకుంటారు. అక్కడి నుంచి ఏడు వేర్వేరు ప్రాంతలకు ఏడుగురు గంగమ్మ ఊరేగింపుగా వెళ్లి కొలువు దీరుతారు. అలాగే బుధవారం రాత్రి తిరిగి మళ్లీ ఏడు గంగమ్మలు ముత్యాలమ్మ ఆలయం వద్దకు చేరుకుని అక్కడ నిమజ్జనంతో జాతర ముగింపు పలికే విషయం తెలిసిందే. ఈ మొత్తం జాతర ఘట్టంలో ఎక్కడ నుంచి ఎక్కెడెక్కడకు ఏయే వేళల్లో ఎంతమంది సిబ్బంది బందోబస్తు నిర్వహించాలన్న అంశాలపై చర్చిం చారు. ఆ మేరకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసేలా ప్రణాళికను రూపొందించారు. మంగళ వారం సాయంత్రం నుంచే శ్రీకాళహస్తి పట్ట ణంలో పోలీసు బలగాలు మోహరించనున్నట్లు వెల్లడించారు.

గాంధీపురం శ్మశానంలోకి తుమ్మలగుంట

మురుగునీరు

దుర్వాసన భరించలేక ఇబ్బందిపడుతున్న స్థానికులు



శ్మశానంలో నిలిచిపోయిన డ్రైనేజీనీరు



రోడ్డుపైకి చేరిన మురుగునీరు

తిరుపతి(గాంధీరోడ్డు), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలో గాంధీపురం గ్రామ పంచాయతీకి సంబంధించిన శ్మశానస్థలంలో డ్రైనేజీనీరు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. చిన్నపాటి వర్షం వచ్చినా డ్రైనేజీ నీరు రోడ్డుపైకి చేరుతుండటంతో అటువైపుగా ప్రయాణించే వాహనచోదకులు, పాదచారులు ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. తుమ్మలగుంట నుంచి వచ్చే డ్రైనేజి నీటితోపాటు చెత్త, వ్యర్థాలు శ్మశాన స్థలంలో నిలిచిపోయి చెరువుని తలపిస్తోంది. దీంతో సమీపంలో నివాసం ఉంటున్న స్థానికులు దుర్వాసన భరించలేక ఇబ్బందిపడుతున్నారు. గ్రామసభల్లో పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఈ సమస్య గురించి విన్నవించినా ఇప్పటికీ పరిష్కారం లభించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి స్థానికులు ఈ సమస్యను తీసుకురాగా, పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తుమ్మలగుంటకి యూడీఎస్ ఏర్పాటు లేకపోవడం వల్ల అపార్ట్‌మెంట్లు, గ్రామం నుంచి వచ్చే డ్రైనేజీనీరు ఇక్కడి చేరుతుందని వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే చొరవ తీసుకుని తుమ్మలగుంటలో యూడీఎస్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిసింది. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హిమంత్‌కుమార్‌ను వివరణ కోరగా.. తుమ్మలగుంటలో దాదాపు రూ.10కోట్లతో యూడీఎస్ పనులు చేపట్టనున్నామని, ప్రస్తుతానికి ఈపనులు టెండర్‌దశలో ఉన్నాయని తెలిపారు. రానున్న ఆరునెలలో యూడీఎస్ నిర్మాణం పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతామని వివరించారు.

రుయాలో గందరగోళంగా దుకాణాల టెండర్

- నోటీసులో స్పష్టత లేకపోవడమే కారణం
- సూపరింటెండెంట్‌పై విరుచుకుపడ్డ యూనియన్ నేతలు



రుయాస్పత్రిలోని దుకాణాలు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలోని దుకాణాల టెండరులో గందరగోళం చోటుచేసుకుంది. గడువు ముగిసిన పది దుకాణాలకు రుయా అధికారులు రెండు రోజుల క్రితం నోటీసు విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ నోటీసులో దుకాణాలకు సంబంధించి స్పష్టత లేకపోవడంతో పాల్గొనదలిచిన వారు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. మంగళవారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని అధికారులు నోటీసులో ప్రకటించారు కానీ ఆ దుకాణాలకు సంబంధించి మెయిన్ బిల్డింగ్ వెనుక, ఓపీ ఎదురుగా, పోలీసు అవుట్ పోస్టు పక్కన అంటూ ఇచ్చారు తప్పా ఇంకే సమాచారం లేదు. దీంతో వాటిల్లో ఎలాంటి వ్యాపారాలు నిర్వహించాలో తెలియక టెండరులో పాల్గొనదలిచిన వారు సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు.

అయిన వారికి కట్టబెట్టేందుకే..

రుయాస్పత్రిలో దుకాణాలపై పలువురు నేతల కన్ను ఉంది. గతంలో వైసీపీ నేతలు ఈ దుకాణాలను అడ్డుపెట్టుకొని రూ.లక్షలు వసూలు చేశారనే విమర్శలున్నాయి. ఇటీవల ఓ నేత వైసీపీ నుంచి జనసేన పార్టీలోకి మారి వెంటనే రుయాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా నామినేటెడ్ పదవిని దక్కించుకున్నాడు. చైర్మన్‌గా చెలామణి అవుతూ దుకాణాదారుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేశారనే ఆరోపణలు వచ్చాయి. జిల్లా అధికారులు ఆయన్ను గట్టిగా మందలించారు. అప్పటి నుంచి రుయాస్పత్రిలో కనిపించకపోయినా ఎమ్మెల్యే దగ్గరే ఉంటూ చక్రం తిప్పుతున్నాడని సమాచారం. 'దుకాణాలు మన వాళ్లకు వచ్చేలా చూడండి' అంటూ కూటమిలోని ఒక పెద్ద నాయకుడి నుంచి రుయా అధికారులుకు ఆదేశాలు వచ్చాయని, అందుకే టెండరు నోటీసులో స్పష్టత లేకుండా చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సూపరింటెండెంట్‌తో యూనియన్ నేతల వాగ్వాదం

దుకాణాల్లో కొన్ని తమకు కేటాయించాలని కొంతకాలంగా కొందరు యూనియన్ నేతలు కోరుతున్నారు. కమిటీ చైర్మన్, కలెక్టరు వెంకటేశ్వర్‌ను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఒక దుకాణం యూనియన్ నేతలకు కేటాయించాలని కలెక్టర్ రుయా అధికారులకు సూచించారు. అయితే మూడు యూనియన్ల నేతల మధ్య సఖ్యత లేకపోవడం, ఒక్కో యూనియన్‌కు ఒక్కో దుకాణం కేటాయించాలని పట్టుబడటంతో అధికారులు అన్ని దుకాణాలను టెండరు కింద ఇచ్చేశారు. దీంతో ఏపీ హంస నేతలు సోమవారం రుయా సూపరింటెండెంట్‌పై విరుచుకుపడ్డారు. ఒక్కో యూనియన్‌కు ఒక్కో దుకాణం ఇవ్వడం కుదరదని ఆయన చెప్పినా వినిపించుకోకుండా వాదనకు దిగారు. అక్కడే ఉన్న అధికారులు, సిబ్బంది వారికి నచ్చజెప్పి పంపారు.

విద్యావ్యవస్థను సక్రమమైన మార్గంలో పెట్టేలా

పేరెంట్స్ మీటింగ్

- మంత్రి కొల్లు రవీంద్ర



ఆలయం ముందు మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

తిరుమల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను సక్రమమైన మార్గంలో పెట్టేలా సీఎం చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించినట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. తిరుమల శ్రీవారిని ఆయన సోమవారం దర్శించుకున్నారు. మంత్రికి వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ... ఈకార్యక్రమం ద్వారా అందరిలో ఓ చైతన్యం వచ్చిందన్నారు. పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు పాఠశాలల్లో ఉన్న లోటుపాట్లను సరిచేసేందుకు ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం శుభపరిణామమన్నారు. దాదాపు 30 వేలకు పైగా పాఠశాలల్లో ఒకే రోజు, ఒకే సమయంలో ఇలాంటి మీటింగ్ నిర్వహించడం చరిత్ర అని చెప్పారు. ఏపీకి మంచి భవిష్యత్తు రాబోతోందన్నారు. అనేక పరిశ్రమలు రాబోతున్నాయని, వాటి ద్వారా అధిక సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా ఆశీస్సులు ఇవ్వాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు. మంచి వర్షాలతో గత ఇరవై ముప్పై ఏళ్లలో ఎన్నడూ లేనివిధంగా నదులు, జలాశయాలన్నీ వంద శాతం నీటితో నిండిపోయాయన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, ఏఐటీయూసీ నేతలు

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని జిల్లాలోని మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ కార్మికులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, కే రాధాకృష్ణ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు.రూ.3వేలతో మధ్యాహ్న భోజన కార్మికులు, 6 వేలతో స్కూల్లో ఆయాలు, రూ.8వేల నుంచి రూ.12 వేలతో పంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. పీఎఫ్ డబ్బులు పట్టుకుంటున్నా అకౌంట్లో జమ చేయడం లేదని ఆరోపించారు. కనీస వేతనం 26వేలు ఉండాలని కోర్టులు చెబుతున్నా కూటమి ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. కరోనా సమయంలో శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో తీసేసిన 24 మంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు మణి, రవి, శివకుమార్, జాన్, మోహన్ రెడ్డి, కార్తీక్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు బాలకృష, చంద్రకళ, సుబ్బరాయుడు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జాన్ భాస్కర్, హరినాథ్ పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తుల రద్దీ నెలకొంది. సుమారు 25వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్రదర్శనం టిక్కెట్ల ద్వారా 1,206మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,050మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,032మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 736, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 221మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 195మంది, రూ.5 వేలు టిక్కెట్ల ద్వారా 57మంది భక్తులు పూజలుచేయించుకున్నారు.

ఆగమోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయ స్వామికి సోమవారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు. అనంతరం గజమాల, వెండి నాగాభరణంతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

మాస్ గ్యాంగ్‌పై పోలీసుల ఉక్కుపాదం

- అర్ధరాత్రి దాటాక రోడ్లపై కనిపిస్తే బైండోవర్ కేసులు



ఈస్ట్ స్టేషన్ పరిధిలో దుకాణాలు, హోటళ్లు మూయిస్తున్న పోలీసులు

తిరుపతి (నేరవిభాగం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అర్ధరాత్రి దాటాక జులాయిగా తిరిగే మాస్ గ్యాంగ్‌లపై పోలీసులు దృష్టి పెట్టారు. వీరిని కట్టడి చేయడానికి ఈస్ట్ పోలీసులు చర్యలు చేపట్టారు. ఆధ్యాత్మిక నగరంలో ప్రశాంత వాతావరణం కోసం పోలీసులు ప్రణాళిక రూపొందించారు. ప్రతి రోజూ బ్లూకోల్ట్స్, ఐడీ పార్టీలు, సిబ్బందిని వెంటపెట్టుకుని అన్ని ప్రాంతాల్లో అధికారులు పర్యటించనున్నారు. రోడ్లపై తిరుగుతూ మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి పెద్దకాపులేఅవుట్, ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్, గ్రూపు థియేటర్, సంధ్య థియేటర్ రోడ్డు, గాంధీ రోడ్డు, తిలక్ రోడ్డు, ఎస్టీవీ కాలనీ, బైరాగిపట్టెడ తదితర ప్రాంతాల్లో మఫ్టీ గస్తీ నిర్వహించారు. గ్రూపు థియేటర్, ఆర్టీసీ బస్టాండు బయట, సంధ్య థియేటర్ పరిసరాల్లో కొందరు అకతాయిలు అమ్మాయిలను వెంట పెట్టుకుని తిరుగుతుండగా వారిని పట్టుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. తొలిసారి కౌన్సిలింగ్ ఇచ్చి వదలేసినా మళ్లీ రోడ్లపై కనిపిస్తే బైండోవర్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని సీఐ రామకృష్ణ సోమవారం చెప్పారు. కాగా, ఆదివారం అర్ధరాత్రి 10 బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఈస్ట్ పరిధిలో రాత్రి 10.30 గంటలకు పైన హోటళ్ళు, బార్లు, మద్యం దుకాణాలు, వర్తక వాణిజ్య సముదాయాలు తెరచి ఉంచితే కేసులు నమోదు చేస్తామన్నారు. రాత్రి పూట మద్యం మత్తులో ఘర్షణలు, గలాటాలు, విధ్వంసాలకు పాల్పడితే 112కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మంత్రి కొల్లును కలిసిన టీడీపీ నేతలు



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్రను సోమవారం టీడీపీ తిరుపతి పార్లమెంటు కార్యాలయంలో టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ పులుగోరు మురళి, తెలుగు యువత పార్లమెంటు అధికార ప్రతినిధి శరత్ కలిశారు. వారు మాట్లాడుతూ పార్టీలో అందరికీ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇసుక, మైనింగ్ పాలసీలు ప్రజలకు అనుకూలంగా ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

వైద్యులు నిరంతర విద్యార్థులు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్

తిరుపతి(వైద్యం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ వైద్యులు నిరంతర విద్యార్థులుగా కొనసాగాల్సిందేనని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ పేర్కొన్నారు. ఎస్వీ వైద్య కళాశాలలో ఆయన వైద్య అధ్యాపకులకు శనివారం మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేలూరు సీఎంసీ వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అధునాతన వైద్య పద్ధతులు, వైద్య పరికరాలు వాటి పనితీరు, వినియోగించాల్సిన తీరు వంటి విషయాలను వైద్యులు నేర్చుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు రవిప్రభు, పార్థసారథిరెడ్డి, నోడల్ ఆఫీసర్ కిరీటి పాల్గొన్నారు.

సరస్వతి విగ్రహ ఏర్పాటుకు దాత సాయం



దాతను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

తిరుపతి అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మంగళం జడ్పీ ట్రెండ్స్ పాఠశాలలో సరస్వతి విగ్రహ ఏర్పాటుకు సోమవారం ఓ దాత ఆర్థిక సాయం అందించారు. 918మంది విద్యార్థులతో కూడిన ఈ పాఠశాలలో సరస్వతి విగ్రహం ఏర్పాటు చేయాలని పాఠశాల కమిటీ సమావేశంలో నిర్ణయించారు. ఇందుకోసం ఖర్చయ్యే రూ.47,828 చెల్లించేందుకు పాఠశాల ఉపాధ్యాయుడు కృష్ణమనాయుడు చొరవతో నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త సి.విశ్వనాథనాయుడు ముందుకొచ్చారు. ఆయన్ను పాఠశాలకు పిలిపించి హెచ్‌ఎం కేశవులనాయుడు ఆధ్వర్యంలో సత్కరించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



వివిధ పరీక్షలకోసం వేచివున్న గర్భిణులు

తిరుపతి అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ప్రతినెలా తొమ్మిదో తేదీన చేపట్టే ఈ పరీక్షల్లో దాదాపు 40 మంది పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ జయంతి ఆధ్వర్యంలో రక్త, మూత్ర పరీక్షలు, వైరల్ మార్కర్స్, హెచ్‌బీ, షుగర్, గర్భం పెరుగుదల వంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేశారు.

ఆలయంలో హుండీ చోరీ



పగులకొట్టిన హుండీ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలోని అంబేడ్కర్ నగర్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీ చోరీకి గురైంది. తిరుపతి రూరల్ ఎస్‌ఐ మూర్తి వివరాల మేరకు.. అంబేడ్కర్ నగర్‌లో ఒకే చోట శివాలయం, వెంకటేశ్వర స్వామి, సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలున్నాయి. సోమవారం తెల్లవారుజామున దుండగులు సిమెంటు జాలీలు పగులకొట్టి లోపలకు ప్రవేశించారు. హుండీ పగులకొట్టి అందులో ఉన్న రూ.వెయ్యి అపహరించుకెళ్లాడు. ఉదయం ఆలయ పూజారి ఈ విషయాన్ని గమనించి ధర్మకర్త అర్జునయ్యకు విషయం తెలిపాడు. ఆయన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మూర్తి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించండి



కలెక్టర్ వెంకటేశ్వర్‌కి వినతి పత్రం అందిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): మంగళం ఎంపీపీ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ నేతలు కోరారు. ఆటస్థలం కేటాయించాలని, సత్యవేడు ఎస్సీ ఎస్‌ఎంహెచ్ హాస్టల్ గదులను ఆధునికీకరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఆ సంఘం జిల్లా కార్యదర్శి భగత్ రవి, ఉపాధ్యక్షుడు బాల వినతిపత్రం అందించారు. జిల్లాలోని 16 ఎస్సీ గురుకుల పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్ అధ్యాపకులు సమ్మెలో ఉండడం వల్ల సిలబస్ పూర్తిగాక 10వ తరగతి విద్యార్థులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. దీనిపై దృష్టి పెట్టాలని కోరారు.

తిరుపతి

కలెక్టర్‌ను కలిసిన ఎస్డీసీ సుధారాణి



తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్ట్ (జీఎన్ఎస్ఎస్) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా సుధారాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు.

డాక్టరేట్ ప్రదానం



శ్రీలక్ష్మి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): ఎస్వీయూ ఫర్మార్మింగ్ ఆర్ట్స్ స్కాలర్ ఇమ్మడి శ్రీలక్ష్మి డాక్టరేట్ పొందారు. గాలి పెంచల నరసింహారావు స్వరపరచిన సంగీత రచనలు - అధ్యయనంపై ప్రొఫెసర్ శంకరగణేష్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. తిరుపతి సమీపంలో గల ఓటేరుకు చెందిన శ్రీలక్ష్మి చిన్నారులకు కర్ణాటక గాత్ర సంగీత శిక్షణ ఇస్తున్నారు. 23 జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పించారు. 15 పరిశోధనా వ్యాసాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయని సీఈ దామ్లానాయక్ తెలిపారు.

టెన్నిస్ టోర్నమెంట్‌లో అధ్యాపకుల ప్రతిభ



బహుమతులను అందుకుంటున్న విజేతలు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎస్వీయూ అంతర్ కళాశాలల అధ్యాపకుల టెన్నిస్ టోర్నమెంట్ సోమవారం జరిగింది. సింగిల్స్‌లో భాస్కర్‌రాజు (ప్రభుత్వ డిగ్రీ కళాశాల)పై ప్రొఫెసర్ మధుసూదన్‌రెడ్డి(ఎస్వీయూ) విజయం సాధించారు. డబుల్స్‌లో ప్రొఫెసర్ వరదరాజన్, డాక్టర్ ఎస్.గఫూర్(ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీ)లపై ప్రొఫెసర్ ఎం.శివశంకర్‌రెడ్డి, ప్రొఫెసర్ మధుసూదన్‌రెడ్డి(ఎస్వీయూ)లు గెలుపొందారు. ఎస్వీయూ రేడియోలాజిస్ట్ ప్రొఫెసర్ హనుమంతరావు విజేతలకు ట్రోఫీ, బహుమతి ప్రదానం చేశారు.

ఇంటర్ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ టోర్నీకి ఎంపిక

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేరళ కొట్టాయంలోని ఎంజీ యూనివర్సిటీలో ఈనెల 20వ తేదీన జరుగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌కు శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థినులు ఎంపికయ్యారు. ఎల్.హర్షిత(బీకాం ద్వితీయ సం.), పి.స్వాతి(బీఎస్సీ ద్వితీయ సం.) ఎంపికయ్యారు. 27న జరగనున్న ఖోఖో టోర్నమెంట్‌కు గౌరిప్రియ, బి.నందిని (బీకాం తృతీయ సం.), హరిప్రియ(ద్వితీయ సం.) ఎంపికయ్యారని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.భద్రమణి ఓ ప్రకటనలో తెలిపారు.

సచివాలయానికి ట్రాక్టర్ వితరణ



తిరుపతి అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మంగళం పరిధిలోని సప్తగిరికాలనీ సచివాలయానికి సోమవారం టాఫే కంపెనీ రూ.6.19లక్షల విలువచేసే ట్రాక్టర్‌ను వితరణ చేసింది. ఈ మేరకు కంపెనీ ప్రతినిధులు తాళాలు, దస్త్రాలను సచివాలయసెక్రటరీ జైశంకర్‌కు అప్పగించారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. చెత్త, ఇతర వ్యర్థాలను తరలించేందుకు, నీటి సరఫరాకు దీన్ని వినియోగించనున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలోని నార్త్ సెక్షన్‌లో మంగళవారం విద్యుత్ తీగల మరమ్మతులు, చెట్లకొమ్మలు తొలగిస్తున్న కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సప్తగిరి నగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో శాంతినగర్, ప్రశాంతినగర్, సప్తగిరి నగర్ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని తెలిపారు.

21 నుంచి బాలోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేదీ నుంచి తిరుపతి బాలోత్సవం నిర్వహించనున్నారు. రెండు రోజుల పాటు నెహ్రూ మున్సిపల్ స్కూల్ వేదికగా నిర్వహించడానికి ఏర్పాట్లు సాగుతున్నాయి. 30 అంశాల్లో 70 విభాగాలుగా పోటీలుంటాయి. 3, 4, 5 తరగతులు సబ్ జూనియర్స్‌గా, 6, 7 తరగతులు జూనియర్స్‌గా, 8, 9, 10 తరగతులు సీనియర్స్‌గా పోటీలు నిర్వహిస్తారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్ విద్యార్థులకు విడివిడిగా బహుమతులు అందజేస్తారు. ఈనెల 13లోపు ఆసక్తి కల్గిన వారు తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. స్పాట్ ఎంట్రీలు ఉండవు. సమగ్ర సమాచారం కోసం 9398000686లో సంప్రదించవచ్చని నిర్వాహకులు మల్లారపు నాగార్జున తెలిపారు.

గుడి స్థలాన్ని గుంజేశారు

- ఫేక్ డాక్యుమెంట్లతో కేసులు పెడుతున్నారు
- పీజీఆర్ఎస్‌లో స్థానికుల వినతి



ఆర్డీవో రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న శివజ్యోతి నగర్ వాసులు

తిరుపతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గుడి అవసరాల కోసం ఉంచుకున్న ఒక సెంటు స్థలాన్ని మాజీ సైనికుల ముసుగులో గుంజేసుకున్నారని, ఇదేమని అడిగితే ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి తమపైనే కేసులు పెడుతున్నారని తిరుపతి అర్బన్ శివజ్యోతి నగర్ రామసాయి మందిరం కమిటీ సభ్యులు సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన ఆర్డీవోకు రెఫర్ చేశారు. అక్కడి నుంచి తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ వద్దకు వచ్చిన కమిటీ సభ్యులు సమస్యను వివరించారు. శివజ్యోతి నగర్ సర్వే నెంబరు 700/బిలో సుబ్రమణ్యం ఆధీనంలో ఉన్న 12 అంకణాల స్థలాన్ని రామ మందిరానికి రాసిచ్చారని తెలియజేశారు. అయితే సంబంధిత స్థలానికి ఆనుకుని ఉన్న మాజీ సైనికుడు అమరనాథరెడ్డి ఫేక్ ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్ సృష్టించి, ప్రశ్నించిన సభ్యులపై ప్రైవేట్, క్రిమినల్ కేసులు పెట్టి వేధిస్తున్నాడని వాపోయారు. డాక్యుమెంట్లు పరిశీలించి సదరు స్థలం గుడికి చెందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్డీవో స్పందిస్తూ తహసీల్దార్ భాగ్యలక్ష్మికి రెఫర్ చేశారు. అక్కడ నుంచి తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేయడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారణ జరుపుతామని ఆమె హామీ ఇచ్చారు.

మనోధైర్యంతో క్యాన్సర్ దూరం



మహిళలకు క్యాన్సర్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మనోధైర్యంతో క్యాన్సర్‌ను నిర్మూలించవచ్చునని మెటర్నటీ ఆస్పత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సంధ్య పేర్కొన్నారు. తిరుచానూరు రాస్ క్లస్టర్ కార్యాలయంలో సోమవారం మహిళలకు క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. స్విమ్స్, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, రాస్ పొదుపు మహిళా సంఘాల సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించిన డాక్టర్ సంధ్యా మాట్లాడుతూ మహిళలు గర్భాశయ, రొమ్ము, నోరు క్యాన్సర్స్ పరీక్షలు చేయించుకోవాలని, ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే సులువుగా నివారించవచ్చునని తెలిపారు. 150 మంది మహిళలకు బీపీ, షుగర్, హెపటైటిస్ పరీక్షలు చేసుకున్నారు. స్విమ్స్ మెటర్నటీ ఆస్పత్రి, రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

చాగంటి నియామకం సరైందే

హిందూ ఉపాధ్యాయ సమితి

తిరుపతి (గాంధీరోడ్డు), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైతిక విలువలను పెంచేందుకు ఏపీ ప్రభుత్వం ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును కమిటీ గౌరవ సలహాదారుగా నియమించడం సరైన నిర్ణయమని హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ దేగల పేర్కొన్నారు. విలువలు కలిగిన వ్యక్తిగా చాగంటికి ప్రజల్లో మంచి పేరుందని, నైతిక విలువల కమిటీకి ఆయన్ను సలహాదారుగా నియమించడం ఎంతో ఉత్తమమని తెలిపారు. ఈ విషయంలో పునరాలోచించాలని సీఎం చంద్రబాబుకు కొంతమంది విద్యావేత్తలు, కవులు, రచయితలు, ప్రజా సంఘాల ప్రతినిధులు లేఖ రాయడాన్ని ఆయన ఒక ప్రకటనలో ఖండించారు.

ఘనంగా సోనియా జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను సోమవారం పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఆ పార్టీ నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నేతలు కేకు కట్ చేసి పంచిపెట్టారు. చిట్టిబాబు మాట్లాడుతూ సోనియా గాంధీ 22 ఏళ్లపాటు పార్టీ పురోగతికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఆమె సారథ్యంలో దేశ ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. నేతలు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి, శివశంకర్, సుప్రజ, గోపీగౌడ్, నరేంద్రబాబు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ చెంగయ్యపై దాడి చేసిన వారిని అరెస్టు చేయండి

దళిత, ప్రజా సంఘాల డిమాండ్



నిరసన ర్యాలీలో దళిత, ప్రజా సంఘాల నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ చెంగయ్యపై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని దళిత, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. తిరుపతి అంబేడ్కర్ భవన్‌లో సోమవారం ఆయా సంఘాల నాయకులు సమావేశమయ్యారు. అనంతరం నిరసన ప్రదర్శన చేపట్టారు. యూనివర్సిటీ, పోలీసు అధికారులను కూడా కలిసి వినతిపత్రం అందజేశారు. దళిత, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రొఫెసర్ చెంగయ్యపై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలన్నారు. బయటి వ్యక్తులు యూనివర్సిటీ ప్రొఫెసర్‌పై దాడి చేస్తే ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. దాడికి గురైన ప్రొఫెసర్‌పైనే కేసు బనాయించడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రొఫెసర్ ఫిర్యాదును పోలీసులు కూడా పట్టించుకోలేదని అన్నారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన తీవ్రం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు గుర్రప్ప, వందవాసి నాగరాజు, జయచంద్ర, సాయిలక్ష్మి, వెంకటరమణ, చిన్నం పెంచలయ్య, పరమశివన్, అంజయ్య, గోవిందయ్య, ప్రసాదరావు, వరలక్ష్మి, వేణుగోపాల్, గోపీ, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

- పీజీఆర్ఎస్‌కు 34 వినతులు
- కమిషనర్ ఎన్.మౌర్య



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యనూ వీలైనంత త్వరగా పరిష్కరించాలని, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 34 వినతులు వచ్చాయని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. 34మంది వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతులు అందించారు. తమ డివిజన్‌లో సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ వినతిపత్రం అందించారు. గొల్లవానిగుంట, శ్రీనివాసపురంలో కాలువలు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, టౌన్ బ్యాంక్ సమీపంలో రాత్రుల్లో టిఫిన్ బండ్లు ఉండడంతో తాగుబోతుల సమస్య ఎక్కువగా ఉందని పలువురు ఫిర్యాదు చేశారు. టి.డి.ఆర్.బాండ్లు ఇప్పించాలని, ఇళ్లకోసం కట్టిన నగదు తిరిగి ఇవ్వాలని, శెట్టిపల్లిలో రోడ్లు, విద్యుత్ దీపాలు, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని, శివజ్యోతినగర్‌లోని అంధుల శరణాలయం వద్ద సమస్యలు పరిష్కరించాలని, గోవింద నగర్ వద్ద కాలువ నిర్మాణం కోసం రోడ్డు తవ్వి వదిలేశారని, పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏడీసీ చరణ్‌తేజ్ రెడ్డి, డీసీ అమరయ్య, ఎస్ఈ శ్యాంసుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్, ఆర్వోలు సేతు మాధవ్, రవి తదితరులు పాల్గొన్నారు.

శబరిమలైకు 34 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదు కేంద్రంగా సికింద్రాబాదు, కాచికూడ, మౌలాలి, హైదరాబాదు రైల్వేస్టేషన్ల నుంచి శబరిమలై భక్తుల సౌకర్యార్థం నుంచి రేణిగుంట మీదుగా 34 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు సీపీఆర్వో ఏ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

హైదరాబాదు-కొట్టాయం, సికింద్రాబాద్ 8 సర్వీసులు

● హైదరాబాదులో ఈ ప్రత్యేక రైలు(07065) జనవరి 7, 14, 21, 28 తేదీలల్లో రాత్రి 12 గంటలకు బయలుదేరి బేగంపేట, లింగంపల్లి, శంకరపల్లి, వికారాబాదు, తాండూరు, సేరం, సులేహల్లీ, యాదగిరి, కృష్ణా, రాయచూర్, మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట్, సేలం, ఈరోడ్, తిరుపూర్, కోయంబత్తూర్, పాలక్కాడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం టౌన్ స్టేషన్ల మీదుగా మరుసటి రోజు సాయంత్రం 4.10 గంటలకు కొట్టాయానికి చేరుకుంటాయి. తిరిగి కొట్టాయంలో ఈ ప్రత్యేక రైళ్లు (07066) జనవరి 8, 15, 22, 29 తేదీల్లో ఉదయం 06.10 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ సికింద్రాబాదుకు మరుసటి రోజు రాత్రి 11.45 గంటలకు చేరుకుంటాయి.

● మౌలాలి-కొట్టాయం మధ్య 10 సర్వీసులు

జనవరి 3, 10, 17, 24, 31 తేదీల్లో మౌలాలిలో ఈ ప్రత్యేక రైలు(07167) మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరి చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట్, సేలం, ఈరోడ్, తిరుపూర్, కోయంబత్తూర్, పాలక్కాడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం, ఎట్టుమనూర్ స్టేషన్ల మీదుగా మరుసటి రోజు సాయంత్రం 6.45 గంటలకు కొట్టాయం చేరేకుంటాయి. కొట్టాయంలో ఈ ప్రత్యేక రైళ్లు(07168)కొట్టాయంలో జనవరి 4, 11, 18, 25 తేదీల్లో రాత్రి 9.45 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ సికింద్రాబాదుకు మరుసటి రోజు రాత్రి 01.30 గంటలకు చేరుకుంటాయి.

● కాచిగూడ-కొట్టాయం మధ్య 8 సర్వీసులు

కాచిగూడలో జనవరి 5, 12, 19, 26 తేదీల్లో ఈ ప్రత్యేక రైళ్లు(07169) మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి మల్కాజ్‌గిరి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట్, సేలం, ఈరోడ్, తిరుపూర్, పొడనూర్, పాల్‌కాడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం, ఎట్టుమనూర్ స్టేషన్ల మీదుగా సాయంత్రం 6.50 గంటలకు కొట్టాయం చేరుకుంటాయి. తిరిగి ఈ ప్రత్యేక రైళ్లు(07170) జనవరి 6, 13, 20, 27 తేదీల్లో కొట్టాయంలో రాత్రి 8.50 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ మరుసటి రోజు రాత్రి 1 గంటకు కాచిగూడకు చేరుకుంటాయి.

● హైదరాబాదు మౌలాలి-కొల్లం మధ్య 8 సర్వీసులు

మౌలాలిలో ఈ ప్రత్యేక రైళ్లు (07171) జనవరి 4, 11, 18, 25 తేదీల్లో సాయంత్రం 6.45 గంటలకు బయలుదేరి భువనగిరి, జనగాం, ఖాజీపేట్, వరంగల్, కెసముద్రం, మహబూబాబాద్, డోర్నకల్లు, ఖమ్మం, విజయవాడ, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట్, సేలం, ఈరోడ్, తిరుపూర్, పొడనూర్, పాల్‌కాడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం, ఎట్టుమనూర్, కొట్టాయం, చెంగనచ్చేరి, తిరువళ్ల, చెంగనూర్ స్టేషన్ల మీదుగా మరుసటి రోజు రాత్రి 10.30 గంటలకు కాయకొల్లాంకు చేరుకుంటాయి. తిరిగి ఈ ప్రత్యేక రైలు (07172) కాయకొల్లంలో జనవరి 6, 13, 20, 27 తేదీల్లో రాత్రి 2.30 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలోనే ప్రయాణిస్తూ మరుసటి రోజు ఉదయం 11.00 గంటలకు చేరుకుంటాయి.

మద్యం దుకాణాల్లో తనిఖీలు



మద్యం దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ ధికారులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలోని మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి, ఏఈఎస్ వాసుదేవ చౌదరి నగరం, రేణిగుంట రోడ్డులోని పలు దుకాణాల్లో తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించారు. మద్యం విక్రయాలు, నిల్వల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దుకాణాల వద్ద ధరల పట్టిక ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లూజ్ విక్రయాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వెటర్నరీ ఉద్యోగుల నూతన కార్యవర్గానికి అభినందన



నూతన కార్యవర్గ ప్రతినిధులను సన్మానించిన ఉద్యోగులు

తిరుపతి రూరల్,డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ బోధనేతర ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గ ప్రతినిధులను సోమవారం పలువురు ఉద్యోగులు కలసి పుష్పమాలతో సన్మానించి అభినందించారు. ఎన్నికైన నూతన కార్యవర్గ ప్రతినిధులు వర్సిటీ రిటర్నింగ్ అధికారి ప్రొఫెసర్ ఆర్.వేణుని కలసి డిక్లరేషన్ పత్రాలను తీసుకున్నారు. అనంతరం వెటర్నరీ కళాశాలలో పలు డిపార్ట్‌మెంట్లను సందర్శించి ఎన్నికల్లో తమ అభ్యర్థిత్వాన్ని బలపరిచిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి శక్తివంచనలేకుండా కృషి చేస్తామని చెప్పారు. బి.మహేష్, సి.మునీంద్రారెడ్డి, నారాయణరావు, కె.మహేంద్రయ్య పాల్గొని ఉద్యోగులను అభినందించారు.

వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

పీజీఆర్‌ఎస్‌కు 183 అర్జీలు



అర్జీదారుల సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత శాఖ అధికారులను హెచ్చరించారు. కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 183 అర్జీలు అందాయి. ఇందులో భూ సమస్యలపైనే 108 వచ్చాయి. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

వికృతమాల హౌసింగ్ కాలనీలో సౌకర్యాలు కల్పించండి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వికృతమాల హౌసింగ్ కాలనీవాసులు

ఏర్పేడు మండలం వికృతమాల పంచాయతీలోని హౌసింగ్ కాలనీలో కనీస వసతులు కల్పించాలని వికృతమాల ప్రభుత్వ గృహాల అభివృద్ధి కమిటీ నేతలు శివయ్య, గోవర్ధన్, పుష్పరాజ్ కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విన్నవించారు. డ్రైనేజీ వ్యవస్థ పాడైపోయిందని, వీధి దీపాలు లేవని, చీకటిపడితే పాములు ఇళ్లలోకి వస్తున్నాయని తెలిపారు. పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేస్తే తమకు సంబంధం లేదని తప్పించుకుంటున్నారని ఆరోపించారు. పరిశీలించి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఏనుగుల నుంచి రైతులను కాపాడండి



జేసీకి వినతిపత్రం ఇస్తున్న రామానాయుడు

ఏనుగుల దాడి నుంచి రైతులను, పంటలను కాపాడాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు కోరారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు వినతిపత్రం అందించారు. పది రోజులుగా 17 ఏనుగులు గుంపుగా తిరుగుతూ పంటలను ధ్వంసం చేస్తున్నాయని తెలిపారు. చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, చంద్రగిరి, పలమనేరు, వి.కోట, గంగవరం మండలాల్లో ఏనుగులు స్వైర విహారం చేస్తున్నా ఫారెస్ట్ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రైతులకు పంట నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో శ్రీనివాసులు, పద్మనాభరెడ్డి, రైతు మల్లికార్జున పాల్గొన్నారు.

అటకెక్కిన శిల్పారామం మాస్టర్‌ప్లాన్



శిల్పారామం ముఖద్వారం - స్టాల్స్, హట్స్



- అభివృద్ధి కోసం 2019లో రూ.10 కోట్లు కేటాయించిన టీడీపీ ప్రభుత్వం
- కక్షతో నిధులను రద్దు చేసిన జగన్ ప్రభుత్వం
- ఆదాయం పెరుగుతున్నా పట్టించుకోని అధికారులు

శిల్పారామం అభివృద్ధికి పదికోట్ల రూపాయలతో రూపొందించిన మాస్టర్ ప్లాన్ ముందుకు కదలడం లేదు. ఏటా సందర్శకుల సంఖ్య, ఆదాయం పెరుగుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఉరుకుల పరుగుల జీవనంలో నగరవాసులకు కాసింత సేదతీర్చేందుకు పట్నంలో పల్లె అనుభూతి కలిగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 22 ఏళ్ల క్రితం తిరుచానూరు రోడ్డులో శిల్పారామం (అర్బన్‌హట్)ను ఏర్పాటు చేశాయి. అప్పటి సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి కాశీరామ్ రాణా చేతుల మీదుగా 16 ఎకరాల ప్రాంగణంలో మట్టి బొమ్మల సోయగాలు, పల్లె సొగసులను హత్తుకునేలా అర్బన్ హట్ ప్రారంభమైంది. భారతీయ సంప్రదాయ కళలు నేటి తరానికి అందించడానికి శిల్పారామంలో అనేక కళా, వస్తు ప్రదర్శనలు ఉన్నాయి. ప్రారంభ రోజుల్లో 150 మంది సందర్శకులు మాత్రమే వచ్చేవారు. నేడు ఆ సంఖ్య 900 మందికి చేరింది. శని, ఆదివారాల్లో ఈ సంఖ్య పెరుగుతోంది. తద్వారా ఆదాయమూ పెరుగుతూ వచ్చింది.

మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనలు ఇవే

శిల్పారామం (అర్బన్‌హట్)లో సందర్శకుల కోసం మరిన్ని సౌకర్యాలు సమకూర్చడానికి రూ.10 కోట్లు మంజూరు చేస్తూ 2019 జనవరిలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కక్షతో ఈ కేటాయింపును రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల ఫలితంగా ఎట్టకేలకు 2020 అక్టోబరులో జగన్ ప్రభుత్వం తిరిగి రూ.10 కోట్లు మంజూరు చేస్తూ పనులు చేపట్టేందుకు అనుమతించింది. మాస్టర్‌ప్లాన్‌ను ఓ ప్రైవేట్ ఆర్కిటెక్ సంస్థచే రూపొందించారు. ఈ ప్రతిపాదనలో ఆర్చితో కూడిన ప్రవేశ ద్వారం వద్ద ప్లాజా నిర్మాణం, సందర్శకుల సౌకర్య కేంద్రాలు, వాటర్ ఫౌంటెన్, కళాత్మకమైన గ్రామీణ వాతావరణంతో వివిధ రకాల స్టాళ్ల ఏర్పాటు, చేతి వృత్తులు, కళాకారులకు శిక్షణ కేంద్రం, ఎంపోరియం, వివిధ స్మారక చిహ్నాలతో కూడిన దుకాణాలు, ఫుడ్‌కోర్టు, ఓపెన్ ఎయిర్ థియేటర్ ఆధునికీకరణ లాంటి పనులకు ఈ నిధులను వ్యయం చేయాల్సి ఉంది. గడచిన నాలుగేళ్ల వైసీపీ పాలనలో శిల్పారామం మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి.

ఆ పది ఎకరాలపై దృష్టి పెట్టండి

శిల్పారామం పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో మరో పది ఎకరాలను కేటాయించడానికి అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న అంగీకరించారు. అందులో బోన్సాయ్, బటర్‌ఫ్లై, రాక్ గార్డెన్స్ ఏర్పాటుకు శిల్పారామం ఉన్నతాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆ స్థలాన్ని సైతం వైసీపీ నేతలు కబ్జా చేయడానికి ప్రయత్నించారు.

కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలి

స్థానికులకు మానసికోల్లాసం అందించడమేగాక ఏడాదికి సుమారు రూ.2 కోట్లు ఆదాయం వస్తున్న శిల్పారామంలో మాస్టర్‌ప్లాన్ పనులు వేగవంతం చేసి, కొత్త సొబగులు దిద్దితే సందర్శకుల సంఖ్యతోపాటూ జిల్లా పర్యాటకం కూడా అభివృద్ధి చెందుతుంది. ఆ దిశగా చంద్రబాబు ప్రభుత్వం దృష్టి సారించాలని నగరవాసులు కోరుతున్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

శ్రీసిటీని సందర్శించిన హిరోషిమా ప్రతినిధుల బృందం



శ్రీసిటీలో ప్రతినిధుల బృందం

శ్రీసిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక వసతులు, వైవిధ్య భరితమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ, వ్యాపార అనుకూల వాతావరణంలో నిర్మాణాత్మక పారిశ్రామిక పార్కును అభివృద్ధి చేయడంలో శ్రీసిటీ యాజమాన్య కృషిని హిరోహరు సకనే నేతృత్వంలోని బృందం అభినందించింది. జపాన్‌లోని హిరోషిమా రాష్ట్రానికి చెందిన నలుగురు సభ్యుల ప్రభుత్వ ఉన్నతాధికారుల బృందం సోమవారం శ్రీసిటీని సందర్శించింది. హిరోహరు సకనే నేతృత్వంలోని బృందానికి శ్రీసిటీ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.శివశంకర్ సాదర స్వాగతం పలికి శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలు, పారిశ్రామిక అనుకూలతలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. 30పైగా జపనీస్ పరిశ్రమల స్థాపనతో భారతదేశంలో రెండో అతిపెద్ద జపనీస్ పరిశ్రమల కేంద్రంగా శ్రీసిటీ గుర్తింపు పొందిందని వారికి వివరించారు. పర్యటనలో పాల్గొన్న ప్రతినిధులు శ్రీసిటీలోని వివిధ అంశాల గురించి విపులంగా అడిగి తెలుసుకున్నారు. హిరోషిమా అధికార ప్రతినిధుల బృందం పర్యటనపై శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. భారత్, హిరోషిమా మధ్య వ్యాపార బంధం మరింత బలపడేందుకు ఈ పర్యటన అత్యంత కీలకమైనదిగా ఆయన పేర్కొన్నారు. ప్రతినిధుల బృందంలో హిరోషిమా ప్రభుత్వ అధికారి యుద్దై హరున్, హిరోషిమా బ్యాంక్ లిమిటెడ్ అధికారులు తకుషి కొసాకా, హిరోకి ఒనిషి తదితరులు పాల్గొన్నారు.

25 కేజీల గంజాయి స్వాధీనం

ఆరుగురి అరెస్టు



నాయుడుపేట టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా నర్సీపట్టణం నుంచి నాయుడుపేటకు గంజాయి సరఫరా చేస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 25 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు సోమవారం మీడియాకు వెల్లడించారు. నర్సీపట్టణానికి చెందిన రాజ్‌కుమార్, బాబి, వెంకటేష్, చక్రవర్తి, నాయుడుపేట పట్టణానికి చెందిన వెంకయ్య, సుబ్బయ్య, మీరమ్మ, వెంకటమ్మకు గంజాయిని సరఫరా చేస్తుంటారు. ముందుగా అందిన సమాచారం మేరకు సోమవారం నాయుడుపేట రైల్వేస్టేషన్ సమీపంలో పోలీసులు నిఘా వేశారు. గంజాయి విక్రయిస్తున్న వెంకటేష్, చక్రవర్తి, వెంకయ్య, సుబ్బయ్య, మీరమ్మ, వెంకటమ్మను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనుంచి 25 కేజీల గంజాయి, 5 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.3 లక్షల విలువ ఉంటుందని చెప్పారు. కాగా, నర్సీపట్టణానికి చెందిన రాజ్‌కుమార్, బాబి, పరారయ్యారు. నిందితుల అరెస్టులో ప్రతిభ కనపరచిన అర్బన్ సీఐ బాబి, ఎస్‌ఐలు భవానీ లక్ష్మి, శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది నాగూరయ్య, రామమోహన్‌రాజు, సాహుల్, భానుతేజ, పోలయ్య, మురళి, షాహిదా, చందన, సుప్రజను డీఎస్పీ అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం

- మందుబాబు తీరుతో

రెండు గంటల పాటు విద్యుత్తు అంతరాయం



ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం వేసిన దృశ్యం

శ్రీకాళహస్తి, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ఫుల్లుగా మద్యం తాగాడు. ట్రాన్స్‌ఫార్మరు వద్ద కరెంటు సరఫరా ఆపేశాడు. ఆపై దానికి తాళం వేసుకుని వెళ్లిపోయాడు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో ఇతడి చర్య వల్ల శ్రీకాళహస్తి పట్టణం ఎన్టీఆర్‌నగర్‌లో రెండు గంటల పాటు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మొదట సాధారణ అంతరాయంగా స్థానికులు భావించారు. అరగంట తరువాత తాగుబోతు పనిగా గుర్తించారు. అతడిని వెదికి పట్టుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు వేసిన తాళాన్ని తీయమని చెబితే.. అతడు వినలేదు. తనను ప్రశ్నించిన వారిపై బూతుల దండకంతో విరుచుకుపడ్డాడు. దాడికీ యత్నించాడు. ఇలా గంటపాటు వీరంగం చేశాడు. విసిగిపోయిన స్థానికులు డిస్కం అధికారులకు, వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి మందుబాబుకు దేహశుద్ధి చేసి ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం తీయించారు. మొత్తమ్మీద రెండు గంటలపాటు విద్యుత్తు సరఫరా లేకుండా చేశాడు. దీనిపై డిస్కం అధికారులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఎన్టీఆర్ నగర్‌వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

రేపటినుంచి ఐఐటీలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

డైరెక్టర్ సత్యనారాయణ



తిరుపతి ఐఐటీ

ఏర్పేడు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ ప్రాంగణం ఈనెల 11 నుంచి రెండు రోజుల పాటు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలేకు సిద్ధమవుతున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ తిరుపతి ఐఐటీకి ఈ అవకాశం రావడం గర్వకారణమన్నారు. దేశంలో ఆవిష్కరణలు, సాంకేతిక పురోగతికి నాయకత్వం వహించడానికి విద్యా మంత్రిత్వశాఖ గుర్తించిన 51 నోడల్ కేంద్రాల్లో తిరుపతి ఐఐటీ ఒకటిగా గుర్తింపబడిందన్నారు. ఇదో మైలు రాయి అన్నారు. హ్యాకథాన్ ఎలైట్ టీంల కలయికకు సాక్షమివ్వనుందని అభిప్రాయపడ్డారు. ప్రతి బృందంలో దేశవ్యాప్తంగా ఉన్న ఆరుగులు ప్రతిభావంతులైన కళాశాల విద్యార్థులు ఉంటారన్నారు. వీరు ఆయూష్ మంత్రిత్వ శాఖ గుర్తించిన నాలుగు క్లిష్టమైన సమ్యల ప్రకటనలకు పరిష్కారం రూపొందించటానికి పోటీ పడతారన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే టీంలు వారి అసాధారణమైన సమస్యాపరిష్కారం నైపుణ్యాలను వినూత్న ఆలోచనలు ఎంపిక చేయబడుతాయన్నారు. ప్రతి సమస్య ప్రకటనపై విజేతలకు భారత ప్రభుత్వం నగదు బహుమతులను అందించి సత్కరిస్తుందని తెలిపారు. యువతలో పరిశోధన, అభివృద్ధి, సంస్కృతిని ప్రోత్సహించటం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ గ్రాండ్ ఫినాలే భారతదేశ విద్యార్థుల నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి వేదికగా మాత్రమే కాకుండా దేశ పురోగతిపై అర్థవంతమైన ప్రభావాన్ని చూపుతుందన్నారు. కొత్త తరం ఇంజనీర్లు, వ్యవస్థాపకులను పెంపొందించటంలో తిరుపతి ఐఐటీ ముందంజలో ఉందని ఆయన అన్నారు.

నేటితో ముగియనున్న పింఛన్ల పరిశీలన

తిరుపతి(మంగళం), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అనర్హత పింఛన్ల ఏరివేతకు రూపొందించిన పైలెట్ కమిటీ ప్రాజెక్ట్ పరిశీలన మంగళవారంతో ముగియనుంది. రెండు రోజులుగా జరుగుతున్న ఈ పరిశీలనలలో 15 అనర్హత పింఛన్లను గుర్తించినట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తెలిపారు. ఒక్కో జిల్లాలో ఎంపిక చేసిన గ్రామపంచాయతీ, వార్డు సెక్రటేరియట్ పరిధిలో పింఛనుదారుల వ్యక్తిగత పరిశీలన కొనసాగుతోందన్నారు. ఇందులో భాగంగా తిరుపతి జీవకోన వార్డు సచివాలయ పరిధిలో 355 పింఛనుదారులకు గాను 322 పరిశీలించామన్నారు. సోమవారం పరిశీలన ముగిసే సమయానికి 32 మందిని పరిశీలించాల్సి ఉందన్నారు. ఈ 32 మందిలో ఒకరు మరణించారని, 31 మంది వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నారన్నారు. మంగళవారం తనిఖీ ప్రారంభయమ్యే సమయానికి వారి చిరునామా గల నివాసాల వద్దకు చేరుకోవాలని ఆయన సూచించారు. ఈ పింఛనుదారుల పరిశీలనలో శ్రీకాళహస్తి డీఎల్‌డీవో సుస్మితరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాధిక, పలువురు వెల్ఫేర్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి పంటకు బీమా నమోదు ప్రారంభం

తిరుపతి(ఎంఆర్‌పల్లె), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద జిల్లాలో మామిడి పంటకు బీమా నమోదు ప్రక్రియ ప్రారంభమైందని ఉద్యానశాఖ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకాన్ని 2024-25 రబీసీజన్‌కు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు సమీపంలోని బ్యాంకులోగాని లేదా మీసేవ, బీమా కంపెనీ నియమించిన వారి ద్వారానైనా ఎకరాకు రూ.1,750 ప్రీమియం చెల్లించి బీమా పొందవచ్చన్నారు. బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు, భూమిపాసు పుస్తకం, పంట వేసినట్లు ధ్రువీకరణ పత్రాల జిరాక్సులను అందించాలన్నారు.


ఆ 600 ఎకరాలు తిరిగి అప్పగించండి!

ఎన్‌బీపీపీఎల్ కంపెనీకి అధికారుల ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): 'శ్రీకాళహస్తి మండలం మన్నవరం వద్ద ఎన్‌బీపీపీఎల్ కంపెనీకి కేటాయించిన భూములలో వినియోగంలో లేని సుమారు 600 ఎకరాలు తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించండి. నూతన పరిశ్రమల స్థాపనకు వాటిని కేటాయించడానికి అవకాశం ఉంటుంది' అని కంపెనీ ప్రతినిధులకు రాష్ట్ర పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్ సూచించారు. ఏపీఐఐసీ ఎండీ అభిషిక్తకిషోర్‌తో కలసి సోమవారం సోమవారం జిల్లా అధికారులతో వర్చువల్‌గా సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్, సదరు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. మన్నవరం వద్ద ఎన్టీపీసీ, బీహెచ్ఈఎల్ పవర్ ప్రాజెక్ట్ లిమిటెడ్ (ఎన్‌బీపీపీఎల్) పవర్ ఎక్విప్మెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమకు 2009లో భూములు కేటాయించారు. ఈ భూ అంశం కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ పరిధిలో ఉందని ఆ కంపెనీ ప్రతినిధులు వివరించారు. కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపడానికి తగు చర్యలు తీసుకోవాలని ఏపీ ఐఐసీ అధికారులను యువరాజ్ ఆదేశించారు.

అధికారులూ.. అభినందనలు

అమ్మవారి బ్రహ్మోత్సవాల విజయవంతంపై ఎక్స్‌లో సీఎం పోస్ట్







తిరుచానూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడం పట్ల సీఎం చంద్రబాబు సోమవారం టీటీడీని అభినందించారు. ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల దివ్య వైభవాన్ని వీక్షించడం నిజంగా ఆనందంగా ఉందన్నారు. టీటీడీ ప్రణాళికాబద్ధంగా ముందు చూపుతో ఏర్పాట్లు చేసుకుని క్షేత్రస్థాయిలో అమలు చేయడం వల్ల భక్తులందరికీ అమ్మవారి ఆశీస్సులు అందేలా చేశారని సీఎం అభినందించారు.

తిరుమలలో మరిన్ని మార్పులు చూస్తారు

- కర్ణాటక భక్తుడి ట్వీట్‌కు ఎక్స్‌లో మంత్రి లోకేశ్ స్పందన

తిరుమల, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): 'మీ తర్వాతి పర్యటనలో తిరుమలలో మరిన్ని మార్పులు చూస్తారు' అంటూ శ్రీవారి భక్తుడి ట్వీట్‌కు ఎక్స్ వేదికగా స్పందించారు మంత్రి నారా లోకేశ్. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. కర్ణాటకకు చెందిన కెంచా అనే పేరుతో ఎక్స్ వేదికగా తిరుమలలోని సౌకర్యాలపై ఓ భక్తుడు ట్వీట్ చేశారు. 'గతంతో పోలిస్తే తిరుమలలో పరిశుభ్రత ఉంది. మరుగుదొడ్లతో పాటు రోడ్లు కూడా శుభ్రంగా కనిపిస్తున్నాయి. శ్రీవారి దర్శన సమయం తగ్గడంతో పాటు క్యూలైన్ నిర్వహణ, అన్నప్రసాదాలు బాగున్నాయి. లడ్డూ నాణ్యత కూడా పెరిగింది. గతంలో లడ్డూ కేవలం రుచి చూసేవాడిని. ఇప్పుడు పూర్తి లడ్డూనే తింటున్నా. ఐదురోజులు ఉంచినా తాజాగా ఉంటోంది. ఎలాంటి కొరత లేకుండా లడ్డూలు ఇస్తున్నారు. ఇక, గదుల కొరత అధికంగా ఉంది. ఉచిత బస్సులు రద్దీగా ఉంటున్నాయి' అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. కర్ణాటక భక్తుడైన తాను ఏపీ రాజకీయాలను పెద్దగా పట్టించుకోనని పేర్కొన్నారు. తరచూ తిరుమలకు వచ్చే భక్తుడిగానే చెబుతున్నానని తెలిపారు. 'తిరుమలలోని మార్పులను ప్రశంసించడం చాలా సంతోషంగా ఉంది. సీఎం చంద్రబాబు పరిపాలన, దార్శనికత కారణంగానే తిరుమలలో పారిశుధ్యం, లడ్డూ రుచి, అన్నప్రసాదం నాణ్యత, శ్రీవారి దర్శనం మెరుగుపడ్డాయి. వసతి, ఉచిత బస్సులు వంటి సూచనలు పరిగణనలోకి తీసుకుంటాం. తర్వాతి మీ తిరుమల పర్యటనలో మరిన్ని మార్పులను చూస్తారు' అంటూ కర్ణాటక భక్తుడి ట్వీట్‌పై నారా లోకేశ్ స్పందించారు.

జిల్లా అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): 'విజయవాడలో బుధ, గురువారాల్లో సీఎంతో కలెక్టర్ల కాన్ఫరెన్స్ ఉంటుంది. దీనికోసం జిల్లా అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి' అని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన వివిధశాఖల వారీగా పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పురోగతి సాధించాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జేసీ శుభంబన్సల్, డీఆర్వో నరసింహులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌-2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. ఇక, శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, రూ.3.58 కోట్లు ఆదాయం లభించినట్టు సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 73,107 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 22,721 మంది తలనీలాలు సమర్పించారు.

ముంగిలిపట్టు వద్ద అనుమానాస్పదస్థితిలో యువతి మృతి



శ్రావణి (ఫైల్ ఫొటో)



కార్తీక్

చంద్రగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం ముంగిలిపట్టు వద్ద సోమవారం రాత్రి 8 గంటల సమయంలో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పాకాల మండలం వడ్డేపల్లెకు చెందిన శ్రావణి(23)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. ముంగలిపట్టు వద్ద జాతీయ రహదారిలో సోమవారం రాత్రి 8 గంటల సమయంలో గుర్తు తెలియని యువతి మృతదేహం రక్తపు మడుగులో పడుందని స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్‌ఐ అనిత, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం వద్ద రెండు జతల చెప్పులున్నాయి. సాయంత్రం 6 గంటల సమయంలో బైక్‌పై తిరుపతి నుంచి ఓ యువకుడితో వస్తూ ఆమె ఏడుస్తూ వాదిస్తోందని కొందరు స్థానికులు పోలీసులకు తెలిపారు. పోలీసుల విచారణలో ఆమె పాకాల మండలం వడ్డేపల్లెకు చెందిన రవి కుమార్తె శ్రావణిగా తేలింది. తిరుపతిలో రిలయన్స్ మార్ట్‌లో పనిచేస్తోంది. ఆమెతో పాటు చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం కమ్మవాండ్లపల్లెకు చెందిన రామ్మూర్తి కుమారుడు కార్తీక్ కూడా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా వీరి మధ్య పరిచయం ఉంది. శ్రావణికి పెళ్లి సంబంధాలు చూస్తున్నారని తెలుస్తోంది. దీనిపై శ్రావణితో మాట్లాడేందుకు కార్తీక్ తిరుపతి నుంచి బైక్‌పై ముంగిలిపట్టుకు తీసుకొచ్చినట్లు తెలిసింది. కాగా, చంద్రగిరి జాతీయ రహదారి వద్ద కార్తీక్ ఉండటంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడు అప్పటికే మద్యం తాగి ఉన్నాడు. ఈ వాదులాట నేపథ్యంలో అతడు ఆమెను రోడ్డుపైకి తోసేశాడా లేదా శ్రావణి ఆత్మహత్య చేసుకొందా? లేక రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగిందా? అనే కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న వీఎస్‌యూ కౌన్సిల్ సభ్యురాలు డాక్టర్ కిర్మమయి, డీఎస్పీ రమణకుమార్

గూడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు పట్టుదలతో ప్రయోగాలు చేయడం ద్వారా శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని విక్రమ సింహపురి యూనివర్సిటీ కౌన్సిల్ సభ్యురాలు డాక్టర్ కిర్మమయి అన్నారు. సోమవారం స్థానిక దువ్వూరు రమణమ్మ మహిళా జూనియర్ కళాశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైన్స్ ఎగ్జిబిషన్ ద్వారా విద్యార్థినుల్లోని సృజనాత్మకశక్తిని వెలికితీసేందుకు వీలుంటుందన్నారు. 5వ ఏపీ గర్ల్స్ బెటాలియన్ కల్నల్ అనూజ్ వాద్వా మాట్లాడుతూ ఎన్‌సీసీ దేశంలోనే గర్వించదగ్గ విభాగంగా గుర్తింపు సాధించిందన్నారు. విద్యార్థినులు ఎన్‌సీసీలో చేరి దేశానికి సేవచేసే అవకాశాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. డీఎస్పీ రమణకుమార్ మాట్లాడుతూ మహిళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు చేపడుతామన్నారు. మహిళల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అనే చట్టాలను అమలు పరుస్తుందని, వీటిపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలన్నారు. పురుషులకు దీటుగా ప్రతిరంగంలోనూ మహిళలు రాణించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థినులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనలను తిలకించారు. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులను అందజేశారు.కార్యక్రమంలో కళాశాల కోశాధికారి విద్యాసాగర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంత్‌రావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్, డాక్టర్ గాయత్రి, విద్యార్థినులు పాల్గొన్నారు.

రాష్ట్ర క్రికెట్ జట్టుకు గూడూరు క్రీడాకారుడు



క్రీడాకారులతో మునిగిరీష్ తదితరులు

గూడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అండర్-14 రాష్ట్రస్థాయి జట్టు ప్రాబబుల్‌కు గూడూరుకు చెందిన క్రీడాకారుడు లీలావికాస్ ఎంపిక కావడం సంతోషకరమని నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ మునిగిరీష్ అన్నారు. సోమవారం స్థానిక ఏఆరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఆయన మాట్లాడుతూ గూడూరులోని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సబ్‌సెంటర్ నుంచి ఇప్పటి వరకు 6మంది క్రీడాకారులు రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెలలో విజయనగరంలో జరగనున్న అండర్-14 రాష్ట్ర క్రికెట్ జట్టు ప్రాబబుల్స్ మ్యాచ్‌కు లీలామోహన్ ఎంపికయ్యాడన్నారు. ఈ మ్యాచ్‌లో ప్రతిభ కనబరిస్తే రాష్ట్ర జట్టులో అవకాశం దక్కుతుందన్నారు. లీలావికాస్ ప్రతిభచాటి రాష్ట్ర జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో లవకుమార్, నాగేశ్వరరావు, నూర్ మహ్మద్, మధు, సుబ్రహ్మణ్యం, రజిని, విజయ్‌కుమార్, మహేష్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్ షరీనా

గూడూరు అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో సోమవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మనపాటి శ్రీనివాసరావు దాతృత్వంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా మాట్లాడుతూ ప్రతినెలా జేవీవీ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేయడం అభినందనీయ మన్నారు. జేవీవీ సైన్స్ పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. కార్యక్ర మంలో వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచునారాయణ, ప్రభాకర్, ఆనంద్, సుబ్బారావు, మస్తాన్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం



లాంగ్ జంప్ చేస్తున్న బెటాలియన్ సిబ్బంది

వెంకటగిరి టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఆరోగ్యం లభిస్తుందని 9వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ అరుణ్ బోస్ అన్నారు. సోమవారం బెటాలియన్‌లో యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏటా బెటాలియన్‌లో గేమ్స్ నిర్వహిస్తున్నామని, దీని ద్వారా సిబ్బందికి శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. మూడు రోజులు పాటు నిర్వహించే క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ పాల్గొంటారని తెలిపారు.

'వినోద్ కుటుంబాన్ని ఆదుకుంటాం'

నాయుడుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రిలో మేల్ కంపౌండర్‌గా పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన పూండ్ల వినోద్‌కుమార్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎంఎస్‌ఎం ఉమ్మడి నెల్లూ రు జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు అన్నారు. సోమవారం నాయుడు పేట మాలయ కోటలోని వినోద్‌కుమార్ స్వగృహానికి వెళ్లి ఆయన సతీమణి సునీత, కుమార్తె వింధ్య కుటుంబసభ్యులను పరామర్శించారు. వినోద్ కుమార్ కంపౌండర్‌గా ఉంటూనే అత్యవసర పరిస్థితుల్లో, యాక్సిడెంట్ సమయాల్లో ఎనలేని సేవలు అందించేవారని గుర్తు చేసుకున్నారు. వినోద్ కుటుంబానికి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు అందేలా చూడడంతో పాటు కారుణ్య నియామకం కింద కుటుంబ సభ్యులకు ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తామన్నారు.

జిల్లా అభివృద్ధిలో పురోగతి సాధించండి

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధిలో ఆయా శాఖల అధికారులు పురోగతి సాధించా లని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమ వారం శాఖల వారీగా ఆయన అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, పురోగతి సాధించాలని సూచించారు. జేసీ శుభం బన్సల్, వివిధ శాఖ ల అధికారులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న బైక్: యువకుడి మృతి

తడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని కొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. దొరవారిసత్రం మండలం మేలనాలతత్తూరు గ్రామానికి చెందిన వేలూరు తులసీరామ్(33) అపాచీ పరిశ్రమలో పనిచేస్తూ సూళ్లూరుపేటలో నివాసం ఉంటున్నాడు. సోమవారం ఉదయం పరిశ్రమకు వెళ్లాడు. విధుల్లో ఉండగా పనిఉందంటూ అనుమతి తీసుకొని సూళ్లూరుపేటకు బయలుదేరాడు. మాంబట్టు సెజ్ రోడ్డులోని ఓ చెప్పుల పరిశ్రమ వద్ద వేగంగా వెళ్తున్న బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఆగిఉన్న కంటైనర్ లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో తులసీరామ్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ మూత్ర విసర్జన చేస్తే జరిమానా

నాయుడుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని ఎక్కడైనా, ఎవరైనా బహిరంగ మల, మూత్ర విసర్జన చేస్తే జరిమానా విధించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా అన్నారు.

నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండు

నిర్వహణ గాలికి ● హైవేలో వెళ్లిపోతున్న బస్సులు





బస్సులు రాకపోవడంతో ఖాళీగా ఉన్న చిల్లకూరు ఆర్టీసీ బస్టాండు - అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

చిల్లకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరులోని ఆర్టీసీ బస్టాండు నిరుపయోగంగా మారింది. చిల్లకూరులో సుమారు 25 ఏళ్ల క్రితం ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని వసతులతో బస్టాండు నిర్మించారు. తొలినాళ్లలో బస్టాండు ప్రయాణికుల రద్దీతో కళకళాడుతుండేది. అయితే క్రమేణా బస్టాండులోకి బస్సులు రాకపోవడంతో పాటు నిర్వహణను ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చే బస్సులు, దూర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు నేరుగా జాతీయ రహదారిపై వెళ్లిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బస్టాండులోకి బస్సులు, ప్రయాణికులు రాకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు, యాచకులకు నిలయంగా మారింది. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండును వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

అభివృద్ధికి ప్రజలు సహకరించాలి: కురుగొండ్ల



ఆర్చి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కోరారు. సోమవారం క్రాస్‌రోడ్డు వద్ద తన సొంతనిధులు రూ.22 లక్షలతో చేపడుతున్న గ్రామశక్తి పోలేరమ్మ ఆర్చి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామశక్తి పోలేరమ్మ జాతర విశిష్టతను తెలియజేప్పేలా వెంకటగిరి క్రాస్‌రోడ్డు వద్ద ఆర్చి నిర్మాణాన్ని చేపడుతు న్నట్లు తెలిపారు. దీని వల్ల క్రాస్‌రోడ్డు నుంచి వచ్చే వాహనాలను పోలకేంద్రం వైపునకు మళ్లించామని, ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. రాష్ట్రంలోనే గుర్తింపు పొందేలా వెంకటగిరి పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు తనవంతు కృషిచేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పట్టణంలో పార్కు ఏర్పాటుకు స్థలాలను గుర్తించడం జరిగిందని, ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి కొంత, తన సొంత నిధులు, దాతల సహకారంతో సమకూర్చుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐ రమణ, నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, ఎంపేడు రవి, కాపా శ్రీనివాసులు, సీకేపల్లి బాబు నాయుడు, కొల్లాపురి సుధా, చెంగారావు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికల్లో విజయానికి సమష్టిగా కృషి చేయాలి: నెలవల



పార్టీ నాయకులకు సూచనలు ఇస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో విజయం సాధించేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం కోరారు. సోమవారం ఆయన నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. విజయమే లక్ష్యంగా అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, కానూరు వరప్రసాద్‌రాజు, గోపాల్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో టీడీపీ సభ్యత్వ నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న సంచి కృష్ణయ్య

పెళ్లకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నడూ లేని విధంగా పెళ్లకూరు మండలంలో రికార్డు స్థాయిలో టీడీపీ సభ్యత్వ నమోదు చేశామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రూ.100తో టీడీపీ సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ఇప్పటి వరకు మండలంలో 5వేల మందికి పైగా టీడీపీలో సభ్యులుగా చేర్పించినట్లు ఆయన వివరించారు. ఇదంతా 24 పంచాయతీల్లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషి ఫలితమేనని అన్నారు. త్వరలోనే 10 వేల మైలు రాయిని చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాటంరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, మదన్‌మోహన్ నాయుడు, పెంచలయ్య తదితరులు ఉన్నారు.

రెవెన్యూ సదస్సులు

బాలాయపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) మండలంలోని వాక్యం, నిండలి గ్రామాల్లో సోమవారం తహసీల్దార్ శీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పాసు పుస్తకాలు, 1బీ నమోదు కోసం 17, హక్కులు కల్పించాలని 6, దారి సమస్యలపై రెండు, ఒకే భూమికి ఇద్దరికి పట్టాలిచ్చారని నాలుగు అర్జీలు అందాయి. కార్యక్రమంలో సర్పంచు కృష్ణయ్య, ఆర్ఐ శ్రీకాంత్, సర్వేయర్ తారకరామారావు పాల్గొన్నారు.

బంగారమ్మ గ్రామోత్సవం



అమ్మవారి కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

కోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడులో గ్రామదేవతల ఉత్సవాల్లో భాగంగా సోమవారం బంగారమ్మ గ్రామోత్సవం జరిగింది. అమ్మవారికి పలు అభిషేకాలు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం చిట్టేడు, ఎన్‌టీటీ కాలనీలో మేళతాళాల నడుమ అమ్మవారి కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గ్రామస్తులు సామూహిక పొంగళ్లు పెట్టారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సన్నాహాలు



క్రాస్‌రోడ్డులో పాత సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న సీఐ హుస్సేన్‌బాషా, ఎస్ఐ పవన్‌కుమార్

కోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోట క్రాస్‌రోడ్డు, ఆర్టీసీ సెంటర్, విద్యానగర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, కోట ఎస్ఐ పవన్‌కుమార్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే ప్రాంతాలను పరిశీలించారు.

విద్యార్థులకు భోజన ప్లేట్ల వితరణ

తడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక తడకండ్రిగ ప్రాథమిక పాఠశాలలో 150 మంది విద్యార్థులకు సూళ్లూరుపేటకు చెందిన సురేంద్రబాబు దంపతులు భోజన ప్లేట్లను వితరణగా అందించారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లికార్జున్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తోలిమిట్ట ప్రభుత్వ పాఠశాలలో శ్రీనివాస సేవా ట్రస్టు(టీవీఎస్) ఆధ్వర్యంలో తిరుపతి అరవింద ఆస్పత్రి వైద్యులు విద్యార్థులకు సోమవారం కంటి పరీక్షలు నిర్వహించారు. స్క్రీనింగ్ టెస్టర్ ఎస్.శంకర్ మాట్లాడుతూ 52మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించామని, వీరిలో ఇద్దరికి చూపు సమస్య ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. కార్యక్రమంలో టీవీఎస్ ప్రతినిధి సురేష్, ఉదయకుమార్, ప్రధానోపాధ్యాయుడు ఉదయ్‌కుమార్, రామకృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

శబరిమలైకు 34 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): హైదరాబాదు కేంద్రంగా సికింద్రాబాదు, కాచిగూడ, మౌలాలి, హైదరాబాదు రైల్వే స్టేషన్ల నుంచి శబరిమలై భక్తుల సౌకర్యార్థం నుంచి రేణిగుంట మీదుగా 34 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు సీపీఆర్‌వో ఏ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

హైదరాబాదు-కొట్టాయం, సికింద్రాబాద్ 8 సర్వీసులు

హైదరాబాదులో ప్రత్యేక రైలు(07065) జనవరి 7, 14, 21, 28 తేదీల్లో రాత్రి 12 గంటలకు బయలుదేరి బేగంపేట, లింగంపల్లి, శంకరపల్లి, వికారాబాదు, తాండూరు, సేరం, సులేహల్లీ, యాదగిరి, కృష్ణా, రాయచూర్, మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట్, సేలం, ఈరోడ్, తిరుపూర్, కోయంబత్తూర్, పాల్‌కాడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం టౌన్ స్టేషన్ల మీదుగా మరుసటి రోజు సాయంత్రం 4.10 గంటలకు కొట్టాయానికి చేరుకుంటాయి. తిరిగి కొట్టాయంలో ఈ ప్రత్యేక రైళ్లు (07066) జనవరి 8, 15, 22, 29 తేదీల్లో ఉదయం 06.10 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ సికింద్రాబాదుకు మరుసటిరోజు రాత్రి 11.45 గంటలకు చేరుకుంటాయి.

మౌలాలి-కొట్టాయం మధ్య 10 సర్వీసులు

జనవరి 3, 10, 17, 24, 31 తేదీల్లో మౌలాలిలో ప్రత్యేక రైలు (07167) మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరి చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట్, సేలం, ఈరోడ్, తిరుపూర్, కోయంబత్తూర్, పాల్‌కాడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం, ఎట్టుమనూర్ స్టేషన్ల మీదుగా మరుసటిరోజు సాయంత్రం 6.45 గంటలకు కొట్టాయం చేరేకుంటాయి. కొట్టాయంలో ఈ ప్రత్యేక రెళ్ల(07168)కొట్టాయంలో జనవరి 4, 11, 18, 25 తేదీల్లో రాత్రి 9.45 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ సికింద్రాబాదుకు మరుసటి రోజు రాత్రి 01.30 గంటలకు చేరుకుంటాయి.

కాచిగూడ-కొట్టాయం మధ్య 8 సర్వీసులు

కాచిగూడలో జనవరి 5, 12, 19, 26 తేదీల్లో ప్రత్యేక రైళ్ల(07169) మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి మల్కాజ్‌గిరి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట్, సేలం, ఈరోడ్, తిరుపూర్, పొడనూర్, పాల్‌కాడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం, ఎట్టుమనూర్ స్టేషన్ల మీదుగా సాయంత్రం 6.50 గంటలకు కొట్టాయం చేరుకుంటాయి. తిరిగి ఈ ప్రత్యేక రైళ్లు(07170) జనవరి 6, 13, 20, 27 తేదీల్లో కొట్టాయంలో రాత్రి 8.50 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ మరుసటి రోజు రాత్రి 1 గంటకు కాచిగూడకు చేరుకుంటాయి.

హైదరాబాదు మౌలాలి-కొల్లం మధ్య 8 సర్వీసులు

మౌలాలిలో ఈ ప్రత్యేక రైళ్లు (07171) జనవరి 4, 11, 18, 25 తేదీల్లో సాయంత్రం 6.45 గంటలకు బయలుదేరి భువనగిరి, జనగాం, ఖాజీపేట్, వరంగల్, కెసముద్రం, మహబూబాబాద్, డోర్నకల్లు, ఖమ్మం, విజయవాడ, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట్, సేలం, ఈరోడ్, తిరుపూర్, పొడనూర్, పాల్‌కాడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం, ఎట్టుమనూర్, కొట్టాయం, చెంగనచ్చేరి, తిరువళ్ల, చెంగనూర్ స్టేషన్ల మీదుగా మరుసటి రోజు రాత్రి 10.30 గంటలకు కాయకొల్లాంకు చేరుకుంటాయి. తిరిగి ఈ ప్రత్యేక రైలు (07172) కాయకొల్లంలో జనవరి 6, 13, 20, 27 తేదీల్లో రాత్రి 2.30 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలోనే ప్రయాణిస్తూ మరుసటి రోజు ఉదయం 11.00 గంటలకు చేరుకుంటాయి.

12న ఉచిత వైద్యశిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్‌క్లబ్ సభ్యులు

గూడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముత్యాలపేటలోని పెల్లేటి రామిరెడ్డి క్లబ్‌లో ఈనెల 12వ తేదీన ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు కోడూరు మీరారెడ్డి, సీనియర్ సభ్యుడు శ్రీకంటి రామమోహన్‌రావు తెలిపారు. సోమవారం క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజల కోసం నెల్లూరుకు చెందిన కిమ్స్(బొల్లినేని) సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణుల పర్యవేక్షణలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. దంత, కంటి, మెదడు, నరాలు తదితర అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వేముల శ్రీధర్, నవీన్‌జయకుమార్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని మోటర్ సైక్లిస్ట్ మృతి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - అన్నమేడు క్రాస్ రోడ్ వద్ద జాతీయ రహదారిపై మోటర్ సైకిల్‌ను లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. నాయుడుపేట మండలంలోని వేముగుంటపాళెం గ్రామానికి చెందిన మనోహర్(55) సోమవారం రాత్రి పట్టణంలో నుంచి మోటర్ సైకిల్‌పై స్వగ్రామానికి వెళుతుండగా అన్నమేడు క్రాస్ వద్ద నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మనోహర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మనోహర్ మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా

గూడూరు అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 12వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం సోమవారం తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాలో పలు బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. వివరాల కోసం 8639835953 ఫోన్ నంబరును సంప్రదించాలన్నారు.

వెలుగు, సచివాలయాల ప్రాంగణాలకు మోక్షం



వెలుగు కార్యాలయం వద్ద గ్రావెల్ తోలిస్తున్న టీడీపీ నేతలు

కోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోటలోని వెలుగు కార్యాలయం, సచివాలయాలకు మోక్షం కలిగింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆయా కార్యాలయాల ఆవరణలో మోకాటి లోతు వరకు నీళ్లు ఉండిపోయాయి. దీంతో ఆయా కార్యాలయాల్లో విధులు నిర్వహించే సిబ్బందితో పాటు ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆయా ప్రాంగణాల్లో గ్రావెల్ లెవలింగ్‌కు తన సొంత నిధులతో శ్రీకారం చుట్టారు. టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, వెంకన్నపాళెం సర్పంచు మధుయాదవ్, నెల్లూరు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయా కార్యాలయాల ప్రాంగణాల్లో గ్రావెల్ లెవలింగ్ చేస్తున్నారు.

గ్రావెల్ టిప్పర్ల అడ్డగింత



టిప్పర్లను అడ్డుకుని నిరసన తెలుపుతున్న స్థానికులు

చిల్లకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతవరం గ్రామం మీదుగా వెళుతున్న గ్రావెల్ టిప్పర్లను స్థానికులు సోమవారం అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామం మీదుగా సాగరమాల రోడ్డు నిర్మాణ పనుల కోసం టిప్పర్ల ద్వారా గ్రావెల్ తరలిస్తున్నారని, దీంతో రోడ్డు దెబ్బతినడంతో పాటు దుమ్ము లేచి ఇళ్లలోని, సమీప దుకాణాల్లో చేరుతోందన్నారు. దుమ్ము లేవకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంతో పాటు రోడ్డును అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

సూళ్లూరుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ మాజీ చీఫ్ సోనియాగాంధీ జన్మదిన వేడుకలను సోమవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటాచలపతి, సీనియర్ నాయకులు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పల్లికొండేశ్వరాలయంలో వైభవంగా లక్ష బిల్వార్చన



నాగలాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో తమిళ కార్తీక సోమవారం సందర్భంగా లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుకుల్ ఆలయంలోని మరగదాంబిక అమ్మవారి సన్నిధి ఎదుట విఘ్నేశ్వర పూజతో అర్చనను ప్రారంభించారు. వృషభ వాహనంపై ఉత్సవ మూరులైన సర్వమంగళాదేవి సమేత వాల్మీకేశ్వర స్వామిని అధిష్ఠింపజేసి వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం మహా దీపారాధనలు చేపట్టారు. తిరుపతి, తిరుత్తణి నుంచి వచ్చిన 15మంది వేద పండితులు శాస్త్రోక్తకంగా లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామిఅమ్మవార్లకు మహా దీపారాధన చేసి ఆలయ ఆవరణలో ప్రాకారోత్సవం నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆలయ ఆవరణలోని రావి చెట్టు ఎదుట నేతి దీపాలు వెలిగించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

పిచ్చాటూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులియంగుంట జడ్పీ ఉన్నత పాఠశాలను డీవైఈవో కె.బాలాజీ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల అభ్యసనశక్తి సామర్థ్యాలపై విద్యార్థులతో కొన్ని ప్రశ్నల ద్వారా ఆరా తీసి స్థితిగతులను తెలుసుకున్నారు. రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తపరచారు. మధ్యాహ్నం భోజనాన్ని తనిఖీ చేసి రుచికి, శుచికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఎంఈవో హేమమాలి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల తొలగింపుపై దీక్ష

సత్యవేడు, డిసెంబరు 9: మండలంలోని పాలగుంట వద్ద ఉన్న కాప్రికార్న్ జ్యూస్ పరిశ్రమలో పనిచేస్తున్న పలువురు కార్మికులను తొలగించడంపై టీఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ రాము ఆధ్వర్యంలో పరిశ్రమ ఎదురుగా దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ పరిశ్రమలో పనిచేస్తున్న 45 మంది కార్మికులను యాజమాన్యం నష్టాల సాకుతో నిలిపివేసిందన్నారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని తెలిపారు.

ఆన్‌కాల్ డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలి

సత్యవేడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ డిపోల్లో పని చేస్తున్న ఆన్‌కాల్ డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐ వర్తింప జేయాలని ఎన్ఎంయూఏ రాష్ట్ర కార్యదర్శి ఎం.చెంచులయ్య కోరారు. సోమవారం స్థానిక ఎన్ఎంయూ భవనంలో యూనియన్ డిపో సెక్రటరీ బాబు ఆధ్వర్యంలో సత్యవేడు ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న కాల్ ఆన్ డ్రైవర్స్ సమావేశం జరిగింది. సంస్థలో ఖాళీగా ఉన్న డ్రైవర్ పోస్టుల భర్తీకి త్వరలో చేపట్టనున్న రిక్రూట్‌మెంట్‌లో ఆన్‌కాల్ డ్రైవర్లకు ప్రాధాన్యం కల్పించాలని, ప్రమాదంలో మరణించిన హైర్ బస్, ఆన్‌కాల్ డ్రైవర్లకు బీమా వర్తింప జేయాలని కోరారు.

పుత్తూరు వార్తలు

పరిహారం కోరిన వేణుగోపాలసాగర్ నిర్వాసితులు



సదస్సులో ప్రసంగిస్తున్న మాధవయ్య

పుత్తూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేణుగోపాలసాగర్ రిజర్వాయర్ మునక భూములకు పరిహారం అందలేదని గోపాలకృష్ణాపురం యానాది కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. గోపాలకృష్ణాపురం సచివాలయ పరిధిలో రెవెన్యూ సదస్సు జరిగింది. వేణుగోపాలసాగర్ నిర్మాణంలో తమకు పరిహారం ఆగిందని 7 కుటుంబాల వాళ్లు సదస్సులో వినతి చేశారు. ఇక కాలనీలో అధికారులు సూచించిన విధంగా ఇళ్లను నిర్మించుకోకపోవడంతో రీసర్వే నిర్వహించి వీధులకు మార్కింగ్ చేయాలని ఇళ్ల పట్టాదారులు గ్రామంలో లేకుంటే కొత్త వారికి ఇళ్లపట్టాలు ఇవ్వాలని సర్వేయర్లను తహసీల్దార్ ఆదేశించారు. ఇళ్ల పట్టాలకు 12, పట్టాలు లేకుండా ఇళ్లు నిర్మించుకున్న 18 మందికి పట్టాలు ఇవ్వాలని, గాలేరు-నగరి నష్టపరిహారం కోసం 9, ఆర్ఓఆర్‌కు 5, సర్వేకు 2 అర్జీలు అందాయి. సదస్సుకు ముఖ్యఅతిథిగా పద్మశాలి కార్పొరేషన్ డైరక్టర్ మాధవయ్య హాజరయ్యారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ తిరుమలసాయి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవలు సద్వినియోగం చేసుకోండి



సదస్సులో అర్జీల తీసుకుంటున్న ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్

వడమాలపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సదస్సులు నిర్వహించే రెవెన్యూ గ్రామాల పరిధిలోని ప్రజలు ప్రభుత్వ ఉచిత రెవెన్యూ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రోజ్‌మండ్ చెప్పారు. సోమవారం మండలంలోని ఎస్వీపురంలో రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ... కొన్ని రెవెన్యూ సమస్యలు కొలిక్కి రావాలంటే ఫెయిర్ అడంగల్ మూలాధారమని చెప్పారు. రైతులందరూ తమ భూములు ప్రస్తుత పరిస్థితి తెలుసుకుని లోటు పాట్లు ఉంటే సవరించుకోవాలని చెప్పారు. తహసీల్దార్ జరీనా, ఎస్వీపురం ఎంపీటీసీ మాజీ సభ్యుడు ధనంజయులు నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు జానా వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

- మున్సిపల్ కమిషనర్‌కు ఏఐటీయూసీ వినతి



పుత్తూరు అర్బన్, డిసెంబర్ 9(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను త్వరితగతిన ఇవ్వాలని ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు మహేష్ కోరారు. ఈమేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌కు వినతిపత్రం అందజేశారు. దశల వారీగా కార్మికుల వేతనాలు పెంచుతామన్న గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వమైనా కలుగజేసుకుని వేతనాలను పెంచాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు నిర్దేశించాలని విన్నవించారు. పారిశుధ్య కార్మికులకు ఏటా అందించే పనిముట్లు, యూనిఫాం, సోపులు, నూనెలు, గ్లోవ్స్, చెప్పులు అందిచడంతో పాటూ క్యాజువల్ సెలవులు మంజూరు సకాలంలో అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే మున్సిపల్ కార్మికులకు ఇంటి స్థలాల కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, శివ, కోమల, గిరి, మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు అండగా కూటమి ప్రభుత్వం



ఎమ్మెల్యే భానుప్రకాష్‌తో ముస్లిం, మైనార్టీ నేతలు

పుత్తూరు అర్బన్, డిసెంబర్ 9(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. సోమవారం టీడీపీ ముస్లిం, మైనార్టీ విభాగ నాయకులు పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర బడ్జెట్‌లో ముస్లిం మైనార్టీలకు అత్యంత ప్రాధాన్యం కల్పిస్తూ నిధులు కేటాయించడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. స్థానిక ఈద్గా వద్ద ఉన్న షాదీమహల్ అభివృద్ధికి, భవానీనగర్‌లోని ఖబరస్థాన్‌కు ప్రహరీ నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ధనపాల్, బాబునాయుడు, కరీం, ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఖాజాపీర్, చిత్తూరు పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ రఫి, శంషూ, అమీర్జాన్, ఖాసీం, జమిల్ నౌషద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోటి దీపోత్సవం, శివపార్వతుల కల్యాణం



పుత్తూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శివ సేవకుల ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కోటి దీపోత్సవం, శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా జరిగాయి. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన కార్యక్రమాల్లో తొలుత మహా గణపతి పూజ, మృత్యుంజయ హోమం, 108 శంఖాభిషేకం, 6 గంటలకు మహాదీపారాధన, కార్తీమాస వైశిష్ట్యం ప్రవచనాలు, 7 గంటలకు శివపార్వతుల కల్యాణం, 8 గంటలకు కోటి దీపోత్సవం జరిగాయి. శివ ఆరాధకులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలను భక్తిశ్రద్ధలతో వెలిగించారు. శివపార్వతుల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే భానుప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం సోనియాగాంధీ 78వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకుడు డాక్టర్ బత్తెయ్యనాయుడు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేర్వేరుగా కార్యక్రమాలు జరిగాయి.

వర్షాలకు దెబ్బతిన్న కేటీ రోడ్డు

దుర్భరంగా మారిన ప్రయాణం







బుచ్చినాయుడుకండ్రిగ, పదవమైలు, అలత్తూరు క్రాస్ దగ్గర రోడ్లపై ఏర్పడిన గుంతలు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీకాళహస్తి - తడ రోడ్డు వర్షాలకు దెబ్బతినడంతో ప్రయాణం దుర్భరంగా మారింది. శ్రీకాళహస్తి నుంచి మండలంలోని ఎన్టీఆర్‌నగర్ వరకు రోడ్డులో ఎక్కడబడితే అక్కడ గుంతలమయమై వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. వరుస తుపాన్లతో కురిసిన భారీ వర్షాలకు రోడ్లు ఛిద్రమయ్యాయి. దీనికి తోడు పైపులైన్ల కోసం తవ్విన మట్టిని రోడ్డుపై వేయడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. పదవ మైలు, విజయ గోపాలపురం, అరిగిల కండ్రిగ, పద్మావతిపురం, బీఎన్ కండ్రిగ, అలత్తూరు క్రాస్ తదితర గ్రామాల మీదుగా వెళ్లే రోడ్డు గుంతలమయమైంది. గుంతల కారణంగా వాహనాలు దెబ్బతింటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గుంతలకు మర్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఏడు గంగమ్మల జాతర బందోబస్తుపై కసరత్తు



గంగమ్మ కొలువు దీరే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ రవి మనోహరాచారి

శ్రీకాళహస్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం వైభవంగా జరగనున్న ఏడు గంగమ్మల జాతరను పురస్కరించుకుని బందోబస్తు ఏర్పాట్లపై పోలీసు అధికారులు కసరత్తు చేశారు. ఈ మేరకు సోమవారం ఏఎస్పీ రవి మనోహరాచారి, శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి ఏడుగంగమ్మల అమ్మవార్లు కొలువు దీరే ప్రాంతాలను పరిశీలించారు. కోర్టు సమీపంలోని ఏడు గంగమ్మల ఆలయం వద్ద బుధవారం వేకువజామున ఏడు గంగమ్మలు ఒకేసారి ఊరేగింపుగా బయలుదేరి పెండ్లిమండపం చేరుకుంటారు. అక్కడి నుంచి ఏడు వేర్వేరు ప్రాంతలకు ఏడుగురు గంగమ్మ ఊరేగింపుగా వెళ్లి కొలువు దీరుతారు. అలాగే బుధవారం రాత్రి తిరిగి మళ్లీ ఏడు గంగమ్మలు ముత్యాలమ్మ ఆలయం వద్దకు చేరుకుని అక్కడ నిమజ్జనంతో జాతర ముగింపు పలికే విషయం తెలిసిందే. ఈ మొత్తం జాతర ఘట్టంలో ఎక్కడ నుంచి ఎక్కెడెక్కడకు ఏయే వేళల్లో ఎంతమంది సిబ్బంది బందోబస్తు నిర్వహించాలన్న అంశాలపై చర్చించారు. ఆ మేరకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసేలా ప్రణాళికను రూపొందించారు. మంగళవారం సాయంత్రం నుంచే శ్రీకాళహస్తి పట్టణంలో పోలీసు బలగాలు మోహరించనున్నట్లు వెల్లడించారు.

రెవెన్యూ సదస్సుల్లో వెల్లువెత్తిన వినతులు



ఇలగనూరులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలంలో ఉదయం ఇలగనూరు, మధ్యాహ్నం కొణతనేరి గ్రామాల్లో తహసీల్దారు మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు జరిగాయి. అలాగే శ్రీకాళహస్తి మండలంలో ఉదయం పాతగుంట, మధ్యాహ్నం మేలచ్చూరు గ్రామాల్లో తహసీల్దారు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. నాలుగు చోట్ల ఆయా గ్రామాల పరిధిలోని రైతులు భూ సమస్యలపై ఫిర్యాదులు చేశారు. మ్యుటేషన్, భూముల సర్వే, డీకేటీ సాగుభూములకు పట్టాలు మంజూరుపై వినతిపత్రాలు సమర్పించారు. మొత్తం నాలుగు చోట్ల కలిపి సుమారు 45 మంది రైతులు ఫిర్యాదు చేశారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని అలత్తూరులో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో అర్జీలు వెల్లువెత్తాయి. ఈ సదస్సులో 75 అర్జీలు వచ్చినట్టు ఆర్ఐ నల్లయ్య తెలిపారు. అధిక శాతం అర్జీలు ఆన్‌లైన్ నమోదు, పట్టాదారు పాసుపుస్తకాలు, భూముల సర్వే కోసం వచ్చినట్టు ఆయన తెలిపారు. తాము ఏళ్లుగా 18 ఎకరాలను సాగు చేసుకుంటున్నా మని, అయినా తమకు పట్టాలు ఇవ్వలేదని తహనగర్‌కు చెందిన బీసీలు సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య ఆధ్వ ర్యంలో అర్జీలు ఇచ్చారు. సర్వేయరు రాజ్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం: మండలంలోని ఎస్ఎస్‌కండ్రిగలో జరిగిన రెవెన్యూ సదస్సులో 20 అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు మునిరత్నం చెప్పారు. 30 ఏళ్లుగా గ్రామంలో అన్నదమ్ముల మధ్య ఉన్న భూతగాదాను సోమవారం రెవెన్యూ సదస్సులో పరిష్కరించినట్లు తహసీల్దారు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు, తెలుగు రైతు మండల అధ్యక్షుడు గోపీనాథరెడ్డి, తెలుగుయువత అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, మాజీ సర్పంచు వెంకటేష్ పాల్గొన్నారు.

రేణిగుంట: పట్టణ సమీపంలోని తారక రామానగర్‌లో నివాసమున్న పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు రెవెన్యూ సదస్సులో తహసీల్దారు సురేష్‌బాబుకు వినతి పత్రం సమర్పించారు. కాగా మొత్తం 8 అర్జీలు వచ్చినట్టు అధికారులు చెప్పారు.

సత్యవేడు: మండలంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 21 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ టీవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని ఇరుగుళం ఉన్నత పాఠశాల ఆవరణలో సదస్సు నిర్వహించారు. ప్రధానంగా ఒకరి భూమిని ఇంకొకరి పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఉన్నారని పలువురు రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. అదే విధంగా గ్రామంలోని అంకాలమ్మ ఆలయానికి సంబంధించిన సర్వే నెం.508లోని 1.39 సెంట్ల భూమిని సర్వేచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. రేషన్ కార్డులు, ఇంటి స్థలాలపై వినతులను అందించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ సర్వేయర్ ప్రసాదరావు, సర్పంచ్ శేఖర్, వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని పంగూరు-శ్రీకాళహస్తికి వెళ్లే రహదారి నుంచి పాగాలి కి వచ్చే రోడ్డును బాగు చేయాలని తహసీల్దారు భార్గవిని పాగాలివాసులు కోరారు. మండలంలోని పాగాలి, పంగూరు పంచాయతీల్లో సోమవారం రెవెన్యూసదస్సులు జరిగాయి. పాగాలిలో 52, పంగూరులో 25మంది రైతులు సమస్యలపై అర్జీలను అధికారులకు సమర్పించారు. డీపీ రోజారమణి, మండల సర్వేయర్ ప్రసాద్, వీఆర్వో సుబ్రహ్మణ్యం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: మండలంలోని కీళపూడిలో రెవెన్యూ సదస్సు సదస్సు జరిగింది. తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, సర్పంచు కల్పన, ఆర్ఐ సుధాకర్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

సత్యవేడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సోనియాగాంధీ జన్మదిన వేడుకలను సత్యవేడులో సోమవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగురవం బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీ విగ్రహం వద్ద కేకు కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా బాలగురవం బాబు మాట్లాడుతూ బీజేపీ ఎన్ని జిమ్మిక్కులు చేసిన 2029 ఎన్నికల్లో సోనియా నేతృత్వంలో దేశంలో పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. అనంతరం మండ కమిటీని ఎన్నుకున్నారు.

రోడ్డుపై నాట్లువేసి సీపీఎం నిరసన



సత్యవేడు. డిసెంబురు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో దుస్థితిలో ఉన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో సత్యవేడు - ఊత్తుకోట మార్గంలో వారపు సంత వద్ద ఆ పార్టీ నాయకులు నాట్లు వేసి నిరసన తెలిపారు. మండలంలో గత వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా గ్రావెల్, ఇసుక రవాణా దాటికి రోడ్లన్నీ ధ్వంసమయ్యాయని తెలిపారు. ప్రస్తుతం రోడ్లన్నీ గుంతలు తేలి మడుగులను తలపిస్తున్నాయని తెలిపారు. ఈ రోడ్లమీద ప్రయాణం నరక ప్రాయంగా మారి ప్రజలు కష్టాలు అనుభవిస్తున్నారని తెలిపారు. ఆర్అండ్‌బీ అధికారులు ఇకనైనా స్పందించి యుద్ధప్రాతిపదికన రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

శ్రీకాళహస్తికి జాతర శోభ





శ్రీకాళహస్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలో ఏడు గంగమ్మల జాతర శోభ నెలకొంది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం అర్ధరాత్రి వరకు ఏడు గంగమ్మల జాతర జరగనుంది. ఈ మేరకు ఆదివారం చాటింపుతో జాతరకు శ్రీకారం పలికారు. అయితే ఒక రోజు ముందుగానే సోమవారం పట్టణంలోని వీధుల్లో విద్యుత్ అలంకరణలు ఏర్పాటు చేశారు. దేవతామూర్తుల చిత్రాలు, విద్యుత్ దీపాలంకరణలు ఆకర్షణగా నిలిచాయి. జాతర ఒకరోజు ముందే సందడి నెలకొంది.

అందుబాటులో యూరియా



బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 సచివాలయాల పరిధిలో 100 టన్నుల యూరియాను అందుబాటులో ఉంచినట్లు ఏవో భారతి తెలిపారు. మండలంలో ఉన్న ఎరువుల దుకాణాల్లో యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు కలగకుండా నిల్వ ఉంచినట్లు తెలిపారు. రైతులు తమ పరిధిలోని కేంద్రాల్లో యూరియాను తీసుకోవాలన్నారు.

అవినీతిని నిర్మూలిద్దాం

పిచ్చాటూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు ఇందిరానగర్ రాజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ అవినీతి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ట్రస్టు ప్రెసిడెంట్ ఆర్.మనోహర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పెద్ద ఎత్తున యువతతో అవినీతి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఆగమోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయ స్వామికి సోమవారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు. అనంతరం గజమాల, వెండి నాగాభరణంతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

కూరుకుపోయిన బస్సు



వరదయ్యపాళెం, డిసెంబరు 9(ఆంధ్ర జ్యోతి): మండలంలోని పెద్దపాండూరు రోడ్డులో సోమవారం లారీ అడ్డుగా ఉండడంతో అటుగా వస్తున్న ఆర్టీసీ బస్సు పల్లంలో ఒరిగింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చెన్నావారిపాళెం వద్ద రోడ్డుకు అడ్డంగా లారీ ఉండడంతో పక్క నుంచి వెళ్లాలనుకున్న నాగలాపురం ఆర్టీసీ బస్సు పల్లంలో కూరుకుపోయింది. దీంతో పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, పరిశ్రమలకు వెళ్లేవారు అవస్థలు పడ్డారు. మధ్యాహ్నం ఇరుక్కుపోయిన బస్సు సాయంత్రం వరకు అలాగే ఉండి పోయింది. బస్సు ఇరుక్కున్న విషయం తెలుసుకున్న ఇతర వాహన చోదకులు కడూరు నుంచి యానాదివెట్టు మీదుగా రాకపోకలు సాగించారు.

పశు వైద్యశిబిరానికి స్పందన

కేవీబీపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరులో తిరుపతి రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం పశువైద్య ఉచిత శిబిరం నిర్వహించారు. ఆవులు, మేకలు, గొర్రెలు తదితర జీవాల్లో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యులు సూచించారు. ముద్దచర్మవ్యాధి, నోటిబిళ్ల వ్యాధి, పురుగుల సమస్యలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య శాస్త్రవేత్త డాక్టర్ అనూష, కేవీకే శాస్త్రవేత్త రామ్‌కుమార్, రాస్ మహిళా ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేష్, సిబ్బంది పాల్గొనగా సర్పంచు సుబ్రహ్మణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తుల రద్దీ నెలకొంది. సుమారు 25వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్రదర్శనం టిక్కెట్ల ద్వారా 1,206మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,050మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,032 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 736, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 221మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 195మంది, రూ.5 వేలు టిక్కెట్ల ద్వారా 57మంది భక్తులు పూజలుచేయించుకున్నారు.

మేత భూముల్లో ఆక్రమణల తొలగింపు

వరదయ్యపాళెం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబూరు పంచాయతీలో మేత బీడు భూముల్లో ఆక్రమణలను రెవెన్యూ అధికారులు తొలగించారు. ఇటీవల సర్పంచ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు ఆక్రమణపై ఫిర్యాదు చేశారు. అదే విధంగా ఆంధ్రజ్యోతిలో కూడా వార్త ప్రచురితమైంది. దీంతో తహసీల్దారు రాజశేఖర్ సర్వే చేయాలని సర్వేయర్‌కు సూచించారు. దీంతో సర్వేయర్ 274/4లో 21.50ఎకరాలు, 275/2లో 2.11 ఎకరాలు ఉన్నట్లు గుర్తించారు. 272సర్వే నెంబరులో 1.54ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. ఆక్రమణదారులు లెక్కచేయలేదు. ఈక్రమంలో సోమవారం ఆక్రమణలను మళ్లీ తొలగించారు.